ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

మంగళవారం | 04-08- 2026 | సంపుటి: 17, సంచిక: 122, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



విగ్రహ ప్రతిష్ఠ చేయకుంటే

## ప్రాణనష్టమే

నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తే కోరికలు నెరవేరుస్తాను

భవిష్యవాణి చెప్పిన మాతంగి స్వర్ణలత

సికింద్రాబాద్, ఆగస్టు 3 (ప్రజాకలం) : సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహం కాళి అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం కీలక ఘట్టం రంగం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగంలో కార్యక్రమంలో భాగం గా పచ్చి మట్టి కుండపై నిలబడి అమ్మవారిని ఆవాహన చేసుకుని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధా నం చెప్పాలని అడిగారు.

తరువాయి 2వ పేజీలో...

సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ

# అనుమతులే లక్ష్యం

తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి
నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రజాకలం) : రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీ ర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమ తుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయప రమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొ న్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొ న్న అంశాలను ప్రస్తావిస్తూ.. గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టుల వారీగా సమగ్రంగా పరిశీ లించి,

తరువాయి 2వ పేజీలో...



ఉద్యోగ సాధన వరకు యువతకు

# అండగా ఉంటాం

రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
పరిశ్రమలకు విద్యుత్,నీరు,మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది
మంథనిలో విస్తృతంగా పర్యటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని,ఆగస్టు 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు.పర్యటనలో భాగంగా శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మన ఊరు-మన కోచింగ్ సెంటర్ ఉచిత కానిస్టేబుల్,ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు.అనంతరం ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. మంథని క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్,ఇతర పరిశ్రమల ప్రతినిధులు,జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత

తరువాయి 2వ పేజీలో...

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్

# మౌలిక వసతులు కల్పించాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

- ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద రూ.3.62 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన
- ఖమ్మం నగర భవిష్యత్ అవసరాలకు 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- భూమి కేటాయింపు పూర్తికాగానే పనులు ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి



ఖమ్మం, ఆగస్టు 03(ప్రజా కలం న్యూస్ ) రానున్న పదేళ్లలో ఖమ్మం నగరం మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద నూతనంగా రూ. 3.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.

తరువాయి 2వ పేజీలో...

## ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం

బంకీపూర్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి నీరజ్‌పై గెలుపు
19,324 ఓట్ల మెజార్టీ కైవసం – ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీ బోణీ
ఎమ్మెల్యేగా ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ రాజీనామాతో బై పోల్



పాట్నా, ఆగస్టు 3: రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక ఫలితాల్లో ఆయన గెలుపొందారు. తద్వారా ఆయన బీహార్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అడుగు పెట్టనున్నారు. మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




# మల్యాలలో విషాదం..

## కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం) జగిత్యాల్ జిల్లా, మల్యాల: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ సమీపంలో ఉన్న బాలుర వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు చిన్నారులు కుంటలో పడి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. గల్లంతైన విద్యార్థుల కోసం పోలీసులు, స్థానికులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు చేపట్టిన విస్తృత గాలింపు చర్యల్లో ఇద్దరి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతులు నాలుగో తరగతి విద్యార్థి జగన్నాథం సుశాంత్, ఐదో తరగతి విద్యార్థి వనం విష్ణుగా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బహిర్భూమికి వెళ్లిన అనంతరం వారు కుంట సమీపానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైనట్లు తెలుస్తోంది. కుంట ఒడ్డున విద్యార్థుల దుస్తులు కనిపించడంతో పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. అనంతరం కుంటలోనే ఇద్దరి మృతదేహాలను గుర్తించి బయటకు తీశారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో వసతి గృహం, గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, చిన్నారుల కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





## విద్యార్థుల మృతి అత్యంత విషాదకరం

ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు – నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు
బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది
: ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం): మల్యాల మండలంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతూ సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు



తరువాయి 2వ పేజీలో...

తెలంగాణలో చారిత్రక కట్టడాల

# పరిరక్షణకు పెద్దపీట

పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం విస్తరణకు కేంద్రం చర్యలు
లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నలకు
వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రులు



ఖమ్మం ఆగష్టు 03(ప్రజా కలం న్యూస్ ) దేశవ్యాప్తంగా చారిత్రక సంపద పరిరక్షణతో పాటు, విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు... ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో సోమవారం అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు వివరాలు వెల్లడించింది. పర్యాటక రంగం బలోపేతానికి చర్యలు, డిజిటల్ విద్యాబోధన తీరుతెన్నులపై వేర్వేరుగా అడిగిన ప్రశ్నలకు.. కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు.

**చారిత్రక కట్టడాల పరిరక్షణకు నిధులు**

దేశవ్యాప్తంగా పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. దేశంలో మొత్తం 3,688 కేంద్ర రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల పరిరక్షణకు హైదరాబాద్ సర్కిల్ ద్వారా గడచిన ఐదేళ్లలో(2021-22 నుండి 2025-26 వరకు) కేటాయించిన నిధులుమరియు వ్యయానికి సంబంధించిన వివరాలను ఆయన పేర్కొన్నారు. తెలంగాణ (హైదరాబాద్ సర్కిల్) పరిధిలో గత ఐదేళ్ల బడ్జెట్ కేటాయింపులు ఇలా.. 2021-22లో రూ. 7 కోట్లుగా ఉన్న కేటాయింపులు, 2022-23 నాటికి రూ. 15.50 కోట్లకు పెరిగాయని, 2025-26లో రూ. 14.93 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. 'అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0' కింద చారిత్రక ప్రదేశాల్లో వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రోత్సాహం**

పాఠశాలల్లో డిజిటల్ విద్యను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వివరాలు కోరారు. జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడానికి బడ్జెట్

తరువాయి 2వ పేజీలో...

### సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ

# అనుమతులే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

**నిర్వాసితుల హక్కులకు రక్షణ**

ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్ట ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూము లు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఆదేశించారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు.

**ఎన్జీటీ, సుప్రీం కేసులకు వ్యూహం**

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్కుమార్రెడ్డి ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్వాటర్ ప్రభావం ఎం తవరకు ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పోలవరం ముంపు లేదా బ్యాక్వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని చెప్పారు.

**అంతర్రాష్ట్ర విభాగాన్ని మరింత బలోపేతం చేయాలి...** తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఉత్తమ్కుమార్రెడ్డి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్ఎన్జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధ నలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు వంటి ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన ఫైళ్లను 30 రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. పర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస ప్రణాళికలు, అటవీ అనుమతుల ఫైళ్లు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల ప్రక్రి య ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు.

# ఉద్యోగ సాధన వరకు యువతకు అండగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి...

కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.

**ఉద్యోగం సాధించే వరకు అండగా ఉంటుంది**

మన ఊరు-మన కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని,ప్రస్తుతం మరో 7 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకోవాలని, రాబోయే మూడు నెలలు జీవితాన్ని మార్చే కాలంగా భావించి స్పష్టమైన లక్ష్యంతో సిద్ధం కావాలని సూచించారు.కోచింగ్ సెంటర్లో అత్యుత్తమ శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు,స్టడీ మెటీరియల్,వసతి,భోజన సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 గంటలు క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వరకు తన బాధ్యత అని, ఉద్యోగం సాధించడం మాత్రం వారి సంకల్పం, కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తాను దారి చూపగలనని,కానీ విజయాన్ని అందుకునేది వారి కృషి ద్వారానేనని అన్నారు. వచ్చే మూడు నెలలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ,మంచి ఆలోచనలతో, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాల్లో ఆనందం నింపినట్లవుతుందని,అదే తనకు నిజమైన సంతృప్తి అని తెలిపారు.

**పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి సహకారం**

మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు,ఇతర పరిశ్రమల ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.పరిశ్రమలకు అవసరమైన విద్యుత్,నీరు,రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం,స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**బొక్కలవాగు అభివృద్ధితో నీటి సంరక్షణ-ప్రజలకు మెరుగైన వాతావరణం**

హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్డ్యామ్ అప్గ్రేడేషన్,సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బొక్కలవాగు వద్ద గార్డెనింగ్,ఓపెన్ జిమ్ అప్గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్,చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ-సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు.బొక్కలవాగు బండ్ అభివృద్ధి పనులకు గతంలో 2011-12లో అనుమతులు లభించాయని, ప్రస్తుతం వాటిని ఆధునికీకరిస్తున్నామని తెలిపారు.ఈ అభివృద్ధి పనులను సామాజిక బాధ్యత సీఎస్ఆర్ కార్యక్రమం లో భాగంగా చేపట్టాలని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను కోరగా,సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులు అందించారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సంరక్షణ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రభుత్వం,పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయగలమని పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను అభినందించారు.తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. బొక్కలవాగు సుందరీకరణ, గార్డెనింగ్, డీ-సిల్టింగ్,వాకింగ్ ట్రాక్,జిమ్, చిన్నారుల పార్కు తదితర అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ వైద్య సేవల బలోపేతానికి చర్యలు**

అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు,వైద్య పరికరాలు,ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన**

పర్యటనలో భాగంగా రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు.పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**మంథని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

మంత్రి మాట్లాడుతూ మంథని పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పలు మౌలిక వసతుల పనులను ప్రభుత్వం ప్రాధాన్యత తో చేపడుతోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సురేష్,మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేం దర్ రెడ్డి,తహసిల్దార్ ఆరిఫ్ ఉద్దీన్,ప్రజా ప్రతి నిధులు,హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు,ఇతర పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,విద్యార్థులు, యువత,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణలో చారిత్రక కట్టడాల పరిరక్షణకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...

కేటాయించినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

**తెలంగాణ డిజిటల్ మౌలిక వసతులు**

రాష్ట్రంలో మొత్తం ఎంపిక చేసిన పాఠశాలలు 41,762 ఉండగా.. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను అందించే దిశగా 2,104 స్మార్ట్ క్లాస్రూమ్లు ఏర్పాటయ్యాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 20,490 పాఠశాలల్లో కంప్యూటర్ సౌకర్యం అందుబాటులోకి రాగా, 15,535 పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలు అనుసంధానించబడ్డాయని మంత్రి తెలిపారు.

**ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ...**రాష్ట్రంలో డిజిటల్ బోధనపై శిక్షణ పొందిన ఉపాధ్యాయుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోందని తెలిపారు. 2020-21లో 2,980 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణను అందుకోగా, 2021-22 నాటికి ఈ సంఖ్య 75,735 మందికి చేరిందని, 2022-23లో 31,273 మంది, 2023-24లో 448 మంది, 2024-25లో16,618మంది,2025-26లో 22,519 మంది ఉపాధ్యాయులు డిజిటల్ శిక్షణను పూర్తి చేసుకున్నట్లు ఆయన వివరించారు.

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్

# మౌలిక వసతులు కల్పించాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. రానున్న పదేళ్ల అవసరాలను అంచనా వేసి అదనపు విద్యుత్ ఉపకేంద్రాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఖమ్మం నగరానికి 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర అవసరమని పేర్కొన్న మంత్రి, ఉపకేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి, ఎక్కడ నిర్మించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్థల ఎంపిక, అంచనా వ్యయం, సాంకేతిక ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి తక్షణమే పంపించాలని ఆదేశించారు. కొత్తగా ప్రతిపాదించే విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని, భూమి కేటాయింపు పూర్తికాగానే శంకుస్థాపన చేసి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన వారే కావడంతో అవసరమైన పరిపాలనా, ఆర్థికపరమైన అనుమతులు త్వరితగతిన లభిస్తాయని అన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్ఓసీలు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ఖమ్మం నగర భవిష్యత్ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మృతి అత్యంత విషాదకరం

మొదటి పేజీ తరువాయి...

కుంటలో పడి మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ, విరామ సమయంలో ఇద్దరు విద్యార్థులు ఎవరికి చెప్పకుండా పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లారని తెలిపారు. వారు తిరిగి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గాలింపు చేపట్టారని చెప్పారు. ఈ క్రమంలో సమీపంలోని కొత్తకుంట వద్ద విద్యార్థుల దుస్తులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించామని వివరించారు. పోలీసులు, మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో కుంటలో గాలింపు చేపట్టగా, దురదృష్టవశాత్తు ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారని తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.ఘటనకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, విచారణలో ఎవరి నిర్లక్ష్యం తేలినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఈ ఘటన అత్యంత బాధాకరమని అన్నారు. విచారణలో విధుల్లో నిర్లక్ష్యం తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, డీఈఓ రాము, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠ చేయకుంటే ప్రాణనష్టమే

మొదటి పేజీ తరువాయి...

మీరు నా మాటలు ఏమైనా ఆచరిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయి. కుంభవర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఈ ఏడాది ప్రాణనష్టం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. వావి వరసలు లేకుండా జనాలు ప్రవర్తిస్తారు. నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తే కోరికలు నెరవేరుస్తాను. ఆర్నెల్లలో విగ్రహ ప్రతిష్ఠ జరగకపోతే వాడవాడలా ప్రాణనష్టమే అని భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, కోట నీలిమ, అధికారులు తదితరులు పాల్గొన్నారు. రంగం కార్యక్రమం అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అధికారులతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి నివేదిక మీద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

**వేడుకగా అంబారీపై అమ్మవారి ఊరేగింపు**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రెండో రోజు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఘట్టం అంబారీపై అమ్మవారి ఊరేగింపు భక్తుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఈ సాంప్రదాయ క్రతువును అధికారులు, పూజారులు నిర్వహించారు. 'రంగం' కార్యక్రమంలో భాగంగా పచ్చి కుండపై నిలబడి మాతంగి స్వర్ణలత అమ్మవారి ఆవహింపుతో భవిష్యవాణి వినిపించారు. భవిష్యవాణి కార్యక్రమం అనంతరం అమ్మవారి సాగనంపు ఘట్టంగా అంబారీపై అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపు కన్నులపండువగా సాగింది. రంగంతో పాటు ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు, ప్రజాప్రతినిధులు ఆలయానికి తరలివచ్చారు.

**మా గౌరవానికి భంగం**

**ధర్నాకు దిగిన జోగినిలు**

**బాట కమాన్ వద్ద అడ్డుకున్న పోలీసులు**

ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో జోగినీలకు అవమానం జరిగిందని జోగిన శ్యామల విచారం వ్యక్తం చేశారు. జోగినుల గౌరవానికి భంగం కలిగిందంటూ సోమవారం అంబారీ ఊరేగింపు సందర్భంగా పలువు జోగినీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.సికింద్రాబాద్ ఆర్పి రోడ్ బాట కమాన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు పైన ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జోగిని శ్యామల మాట్లాడుతూ..ఘటనపై ప్రభుత్వం, దేవాదాయ శాఖ స్పందించాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ పనితీరు బాగాలేదన్నారు. జోగినులకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవాదాయ శాఖ పరిధిలో జోగినులకు ప్రత్యేక స్థానాలు, హోదాలు ఇవ్వాలన్నారు. బోనాల ఉత్సవాల్లో జరిగిన అపచారాన్ని సరిదిద్దాలని కోరారు. వారంరోజుల్లో తిరిగిబోనాలు సమర్పించేందుకు సిద్ధమవుతున్నట్లు జోగినిలు ప్రకటించారు.

# ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం

మొదటి పేజీ తరువాయి...

ఈ అసెంబ్లీ స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 19,324 ఓట్ల ఆధిక్యంతో పీకే విజయం సాధించారు. ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీకి మొట్టమొదటి విజయం ఇదే కావడం విశేషం. ఓటమిపై సీఎం సామ్రాట్ చౌదరి స్పందిస్తూ.. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, ప్రశాంత్ కిశోర్కు అభినందనలు తెలిపారు. మరోవైపు, బీజేపీకి అత్యంత పట్టున్న అసెంబ్లీ స్థానంలో పీకే గెలుపొందడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటైనా సంపాదించని జన సురాజ్ పార్టీ, తమ పార్టీకి కంచుకోట అయిన బంకీపూర్లో విజయం సాధించడంపై బీజేపీ నేతలు విస్మయానికి గురవుతున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ప్రస్తుత పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో నియోజకవర్గంలో అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలో ఓడిన నీరజ్కుమార్ సిన్హా అనే వ్యక్తి నబీన్ చిన్ననాటి స్నేహితుడే.

**బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: ప్రశాంత్ కిశోర్...**తన గెలుపు కేవలం ఒక ఎమ్మెల్యే సీటు దక్కించుకోవడమే కాదని, బీజేపీ నాయకత్వానికి బంకీపూర్ ప్రజలిచ్చిన స్పష్టమైన సందేశమని ప్రశాంత్కిశోర్ అభివర్ణించారు. 30 ఏళ్ల బీజేపీ కంచుకోటను, తాము 30 రోజుల్లోనే తునాతునకలు చేశామని హర్షం వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక ఫలితాల తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం సామ్రాట్ చౌదర్తోపాటు బీజేపీని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కుల మత రాజకీయాలను దాటి, ఇప్పుడు బీహార్ ప్రజలు స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. నేరచరిత్ర ఉన్న వ్యక్తిని సీఎం పీఠం నుంచి దింపేయాలని ప్రజలు చూస్తున్నారని సీఎం సామ్రాట్ చౌదరిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర యువత జీవితాలు మారాలన్నా, వారి భవిష్యత్తు బాగుండాలన్నా, సచ్ఛీలురైనా ముఖ్యమంత్రి వల్లే అవుతుందని పేర్కొన్నారు. గుజరాత్ తరహాలోనే బీహార్ అభివృద్ధి చెందాలంటే, రాష్ట్రానికి మరిన్ని మౌలిక వసతులు, పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని, అది జరిగితేనే రాష్ట్రం నుంచి వలసలు ఆగిపోతాయని అభిప్రాయపడ్డారు. కేవలం 15,000 కోసం కుటుంబాన్ని వదిలి, పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితులు మారాలన్నారు. తన పోరాటం ఏ ఒక్కరిపైనో కాదని, బీజేపీ, ఎన్డీయే కూటమి విధానాల పైనేనని స్పష్టం చేశారు. కేంద్రం అన్ని సదుపాయాలు, నిధులు గుజరాత్కే ఇస్తే, ఇక బీహార్ వంటి వెనుకబడిన రాష్ట్రాల పరిస్థితి ఏంటని నిలదీశారు. తాను ఎమ్మెల్యే అవ్వగానే బంకీపూర్ ఇక రేపో మాపో బెంగళూరు అయిపోదని చమత్కరిస్తూనే, నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ముక్తాయించారు.

**ప్రశాంత్ కిశోర్ నేపథ్యం..**

కెరీర్ తొలిరోజుల్లో పీకే ఐక్యరాజ్య సమితి (ఐరాస)లో ప్రజారోగ్య నిపుణుడిగా సేవలందించారు. 2014లో భారత్కు వచ్చి పొలిటికల్ కన్సల్టింగ్ సంస్థ ఐ-ప్యాక్ను స్థాపించారు. ఇదే ఏడాది బీజేపీకి వ్యూహకర్తగా పనిచేశారు. తర్వాత 2015లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్ బంధన్ విజయం కోసం పనిచేశారు.

2019 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయం కోసం వ్యూహరచన చేశారు. తర్వాత వరుసగా ఢిల్లీలో ఆప్, తమిళనాడులో డీఎంకే, బంగాల్లో టీఎంకే విజయం కోసం పనిచేశారు. 2021లో వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. జన్ సురాజ్ పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనేకచోట్ల పోటీ చేసినప్పటికీ, ఎలాంటి విజయాన్నీ సాధించలేదు. నాడు పీకే ఎన్నికల బరికి దూరంగా ఉన్నారు. బంకీపూర్ ఉప ఎన్నికలో పోటీ చేసి విజయ బావుటా ఎగురవేశారు.

**మరో రెండు స్థానాల్లోనూ ఫలితాలు**

బీహార్లోని బంకీపూర్తో పాటు మధ్యప్రదేశ్లోని దతియా, గుజరాత్లోని మంజల్పూర్ ఉప ఎన్నికల ఫలితాలు కూడా విడుదలయ్యాయి. దతియాలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్శ్యామ్ సింగ్ గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీ ఓటమిపాలయ్యారు. మంజల్పూర్లో బీజేపీ అభ్యర్థి సతీష్పటేల్ గెలిచారు. కాంగ్రెస్ నేత జయాబెన్ రబారీ ఓడారు.

# నేడు రుద్రంగిలో మంత్రి పర్యటన

రుద్రంగి, ఆగస్టు 03, (ప్రజాకలం ప్రతినిధి) కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి నేడు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో పర్యటించనున్నారు. రూ. 46 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనుల భూమి పూజ, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరు కాబడిన సీసీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఆయన వెంట ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ రానున్నారు.

# తల్లి పాలు.. బిడ్డకు క్షేమం..

## వెల్గటూర్ సర్పంచ్ కవిత



వెల్గటూర్, ఆగస్టు 3, ప్రజాకలం ప్రతినిధి : తల్లిపాలు బిడ్డకు క్షేమమని వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత అన్నారు. సోమవారం వెల్గటూర్ లో గల అంగన్వాడీ 2వ కేంద్రం లో తల్లి పాల వారోత్సవాల లో భాగంగా అంగన్వాడీ టీచర్ బండమీది మల్లేశ్వరి బాలింతలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లి తన బిడ్డకు ముర్రు పాలు పట్టించాలని తెలిపారు . తల్లి పాలు బిడ్డ కు జీవితాంతం వ్యాధి నిరోధక టీకాలాగ పని చేస్తుందని పేర్కొన్నారు. ఎటువంటి పానియాలు బిడ్డకు తాగించరాదని తెలిపారు. బిడ్డ పాలు తాగినన్ని రోజులు తల్లి తన పాలను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడ గల పిల్లలకు వారి బరువులు, ఎత్తులు, జబ్బ కొలతల వంటివి తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ బండమీది మల్లేశ్వరి, బాలింతలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోమన్న కాంగ్రెస్ నాయకులు

## - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి



ధర్మారం, ఆగస్టు 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం పంప్ హౌస్ దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ఎల్లంపల్లి ప్రాజెక్టుపై నియోజకవర్గ అభివృద్ధి పై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ సీనియర్ నాయ కులు మద్దుల గోపాల్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రోజున నంది మేడారం పంప్ హౌస్ వద్ద వారు మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని 6000 కోట్లతో అప్పుడు నిర్మించిన కాలువలు ద్వారానే రైతంగానికి సాగునీరు అందుతుంద న్నారు. పదేళ్లు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతర నియోజకవర్గాల నాయ కుల ను అరువు తెచ్చుకుని రైతులపై ముసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్తారని మద్దుల అన్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు పనికి రాకుండా పోయింద న్నారు. బీఆర్ఎస్ నాయ కులు దానిపై మాట్లాడాలని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని మద్దుల హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్లుల్ల గడ్డ.. జీవన్ రాజ్‌కు అడ్డా జిల్లా పోలీసు సంఘ అధ్యక్షుడిగా గ్రామీణ కిరణం!



మెట్‌పల్లి రూరల్,ఆగస్టు 03;(ప్రజా కలం);సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి, క్రమశిక్షణే ఆయుధంగా ఎదిగిన ఒక యువకుడు జిల్లా స్థాయిలో అత్యున్నత బాధ్యతలను చేపట్టడంతో ఆ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన అంగరి జీవన్ రాజ్ జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా/ఘనంగా ఎన్నికయ్యారు. జీవన్ రాజ్ ఎన్నికైన వార్త తెలియగానే స్వగ్రామమైన వెల్లుల్లలో ఆనందోత్సాహాలు అంబరాన్నంటాయి. గ్రామస్థులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన సాధారణ కుటుంబంలో జన్మించి, తన సొంత కృషి, క్రమశిక్షణతో పోలీసు శాఖలో పేరు తెచ్చుకోవడమే కాకుండా, ఈ రోజు జిల్లా స్థాయి పదవిని చేపట్టడం మా గ్రామా యువకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు, పోలీసు శాఖలో సహచరుల నమ్మకాన్ని గెలుచుకుని, వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే మనస్తత్వమే ఆయనను ఈ స్థానంలో నిలబెట్టిందని పలువురు కొనియాడారు. జీవన్ రాజ్ ప్రయాణం గ్రామంలోని యువతకు ఎంతగానో స్ఫూర్తినిస్తుందని, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న అంగరి జీవన్ రాజ్‌కు ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, పోలీసు శాఖలోని సహచరులు, వెల్లుల్ల గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి




జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజా కలం)

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని సీఈఓ సూచించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, అనామలీలు, మ్యాపింగ్ సమస్యలు, డీఎస్ఈ/ఏఎస్‌డీ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యుల ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి వీలైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలా చూడాలని, ఫోటో మిస్‌మ్యాచ్ ఉన్న ఓటర్ల వివరాలను తప్పనిసరిగా సరిచేయాలని బీఎల్‌వోలకు సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని, బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల మేరకు పరిశీలించాలని తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన ఫొటోలు, సంతకాలు, ఇతర వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను కచ్చితంగా పాటిస్తూ అన్ని ప్రక్రియలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అధికారులు తమ మొబైల్ నంబర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో నవీకరించుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 89.38 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని తెలిపారు. అలాగే ఏఎస్‌డీ జాబితాను త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం

## - లయన్స్ క్లబ్ సేవలు అద్భుతమన్న ఎంపీడీవో వేముల సుమలత

ధర్మారం, ఆగస్టు 03 :( ప్రజాఫలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం లో ధర్మారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మారం మండల ఎంపీడీవో వేముల సుమలత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అద్భుతమని ధర్మారం మండల పరిషత్ అభివృద్ధి అధి కారి వేముల సుమలత ప్రశంసించారు. ధర్మారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం



రోజున ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వ హించారు. ధర్మారం గ్రామపంచాయతీ ఆవరణ లో ప్రోగ్రాం చైర్మన్, డిస్టిక్ పి ఆర్ ఓ లయన్ తన్నీరు రాజేందర్ నిర్వహణ లో ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ చింత పండు నర్సింగం ఆధ్వర్యం లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మంది కంటి పరీక్షలు చేసుకోగా, తొలి విడతగా 30 మందిని ఎంపిక చేసి రేకుర్తి కంటి ఆసుపత్రికి ఆపరేషన్ల నిమిత్తం తరలించారు. ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన ధర్మారం ఎంపీడీవో వేముల సుమలత లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. నిస్వార్థంగా తమ సమయాన్ని కేటాయించి తమ సొంత డబ్బులు ఖర్చు చేస్తూ, లయనిజం ద్వారా సమా జానికి సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. 11వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భం లో గడచిన పదేళ్లలో ధర్మారం లయన్స్ క్లబ్ అందించిన సేవలు కరోనా సమయం లో చేసిన సేవలు చిర స్థాయిగా గుర్తుంటాయని అన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న నేత్రదాన కార్య క్రమాలు, రక్తదాన శిబి రాలు, అవయవ దాన కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యులై తమ సంపూర్ణ సహకారం అందించాలని, గొప్ప సేవలు అందిస్తున్న ధర్మారం లయన్స్ క్లబ్ కు తమ సంపూర్ణ సహకారం ఎప్పుడు ఉ ంటుందని ధర్మారం మండల ఎంపీడీవో వేముల సుమలత తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధర్మారం సర్పంచ్ దాగేటి రాజేశ్వరి మాట్లాడుతూ, ధర్మారం లయన్స్ క్లబ్ సేవ కార్యక్రమాల్లో ముందుందని తమ పాలకవర్గం సహ కారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ధర్మారం సర్పంచ్ దాగేటి రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఎలిగేటి మల్లేశం, కార్యదర్శి గుమ్ముల రాజేందర్, పాలకవర్గ సభ్యులందరూ ధర్మారం లయన్స్ క్లబ్ సేవలను కొనియాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు అందరినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం కో చైర్మన్లు లయన్ డాక్టర్ కామని శ్రీనివాస్, లయన్ పుచ్చకాయల మునిందర్ రెడ్డి, డిస్టిక్ మైక్రో క్యాబినెట్ సభ్యులు సామ ఎల్లారెడ్డి, డిస్టిక్ జిఎస్టి కోఆర్డినేటర్ లయన్ సాదుల వెంకటేశ్వర్లు, రిజనల్ చైర్మన్ లయన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్మన్ లయన్ తలమక్కి రవీందర్ శెట్టి, క్లబ్ కార్యదర్శి లయన్ కట్ట రమేష్, నాడెం శ్రీనివాస్, ఎండి ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# గడి బురుజు భూమిపై వీఎల్‌టీ రద్దు చేయాలి

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి – కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం)

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ను కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మొదటగా కోరుట్ల పట్టణంలోని గడి బురుజు భూమిపై విధించిన వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గడి బురుజు భూమి కోరుట్లకు చారిత్రక, ప్రజా ప్రాధాన్యం కలిగిన ఆస్తి అని, దానిని ప్రజా ప్రయోజనాల కోసం పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మరో వినతిపత్రం అందజేశారు. నిధులు విడుదల కాకపోవ డంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందు



లు ఎదుర్కొంటున్నారని, విద్యాసంస్థలు ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తూ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల విద్యాభవిష్యత్తు దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, అలాగే గడి బురుజు భూమిపై విధించిన వీఎల్‌టిని రద్దు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం)

ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 60 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని వెంటనే సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి ఆగస్ట్ 3 (ప్రజాకలం)

నాషా విముక్తి భారత్ కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ఒక కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆవిష్కరించారు.వ్యసన విముక్తి, తల్లిపాలు, జలసిరి పోస్టర్ల కలెక్టర్ ఆవిష్కరించారు.కలెక్టర్ లోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “నాషా విముక్తి భారత్” కార్యక్రమంలో భాగంగా 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ లక్ష్యంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు. అలాగే జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల పోస్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన తెలంగాణ జలసిరి (ఎల్‌నినో ప్రభావం––వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొందాం) అవగాహన పోస్టర్‌లను కూడా కలెక్టర్ ఆవిష్కరించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# గుల్లకోట రైతు వేదిక లో తల్లిపాల వారోత్సవాలు

## – పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగించాలన్న సర్పంచ్ మల్లేష్ గౌడ్



ఎండపల్లి, ఆగస్టు 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని గుల్లకోట రైతు వేదిక లో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యం లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు పుట్టిన ఒక గంట లోపే ముర్రు పాలు త్రాగించాలని, తల్లి పాల లో అనేక పోషకాలు విటమిన్స్ ఉంటాయని, 6 నెలల వరకు కచ్చింతంగా తల్లిపాలు త్రాగించాలి, సెరలక్ వద్దు–బాలామృతం ముద్దు ప్రతి ఒక్కరు మాత శిశివు హాస్పిటల్ లోనే వైద్యం తీసుకోవాలని మెడిసిన్ కంటే ఇంట్లోనే మంచి ఆహారం తీసుకో వాలని గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ సూచించడం జరిగింది. ప్రైవేట్ హాస్పిటల్ మెడిసిన్ వల్లనే నార్మల్ డెలివరీలు కావడం లేదన్నారు, చిన్నారులను ఆశీర్వాదించి అన్న ప్రసన చేయడం జరిగింది. బాలికలను రక్షిద్దాం–బాలికలను చదివిద్దామని గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్, సిడిపిఓ వాణి శ్రీ, సూపర్వైజర్ ఆండాలు, ఉప సర్పంచ్ అరిగేలా జయవ్వ రవి, గ్రామ కార్యదర్శి నవీన్, ఐసిడిఎస్ మెంబెర్స్, డాక్టర్ రక్షిత, అంగన్ వాడి టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, తల్లులు, చిన్నారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడు మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం




ఎండపల్లి, ఆగస్టు 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలంలోని గుల్లకోట రైతు వేదిక లో నేడు మంగళవారం రోజున ఉదయం 10:00 లకు గుల్లకోట–రైతు వేదిక లో మండల అభివృద్ధి కార్యక్రమాల పైన సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుంది ఇట్టి సమావేశం ఎండపల్లి మండల ప్రత్యేక అధికారి ఎం. రవి ప్రసాద్ (డిఎఫ్ఓ) అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, పాత్రికేయలు సమయానికి హాజరు కావాలని ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

# భాదితులకు సత్వరమే న్యాయం

## గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదుల స్వీకరణ..

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం)

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు సమర్పించిన వినతిపత్రాలు, సంబంధిత పత్రాలను పరిశీలించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.



ప్రజా కలం

మంగళవారం, ఆగస్టు 04, 2026

# సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం. 2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



## - అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

పెద్దపల్లి,ఆగస్టు 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం తొగ్రాయి గ్రామానికి చెందిన ఈదునేరు పద్మ తన భరత మరణించిన తర్వాత తన ఇద్దరు కుమారులు కోడలు అన్నం పెట్టడం లేదని తన భూమిని దౌర్జన్యంగా దున్నుకుంటున్నారని తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం గౌ రెడ్డి పేట గ్రామానికి చెందిన పద్మ తన భూమిలో కార్పొరేషన్ బోరింగ్ మంజూరు అయిందని,తనకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి విద్యుత్తులైన మోటర్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా హార్టికల్చర్ అధికారికి రాస్తూ సోలార్ పంప్ సెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు.మంథని కు చెందిన ఆకుల సౌమ్య పట్టణంలోని పదవ వార్డు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్ట్ తనకు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారి కు రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అదనపు తెలిపారు.పెద్దపల్లి మండలం రంగంపల్లికి చెందిన ఎం.జయశ్రీ తను బీఎస్సీ నర్సింగ్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసానని,తనకు ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న మెడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టు భర్తీ చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కు రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఏఓ బి.ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలి

## – శానబండ గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్

ఎండపల్లి, ఆగస్టు 03 : ( ప్రజా కలం ప్రతినిధి )

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామాభివృద్ధికి చేయూతనివ్వాలని ఎండపల్లి మండలం శానబండ గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు అందకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరత కారణంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్వహణతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పన కూడా కష్టసాధ్యంగా మారిందన్నారు. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచులుగా గెలిచి నప్పటికీ ఆర్థిక వనరుల లేమితో గ్రామాల అభి వృద్ధికి అవసరమైన పనులు చేపట్టలేక ప్రజల ముందు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసిన ప్రజా ప్రతినిధులు బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. రెండేళ్లపాటు ప్రత్యేక అధికారుల పాలన అనంతరం ఎన్నికైన




సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కూడా గతంలో పేరుకుపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకే సరిపోవడంతో కొత్త అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన గ్రామ స్థాయి లో ఫలించా లంటే పంచాయతీలకు తగిన నిధులు అందించడం అత్యవసరమని స్పష్టం చేశారు. పంచాయతీ నిధులే ప్రజాపాలనకు ఆధారమని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం సమగ్రా భివృద్ధి సాధిస్తాయని అన్నారు. పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి సర్పంచుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేయాలని శాన బండ గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు.

# మహాలక్ష్మమ్మ బోనాల పండుగకు ముస్తాబైన మెట్‌పల్లి

## భక్తుల సౌకర్యార్థం నూతన మోటార్ పంప్ ప్రారంభం

## భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు.. - మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాకలం) పట్టణంలోని శ్రీ మహాలక్ష్మమ్మ బోనాల పండుగను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని బోరు బావిలో పనిచేయకుండా ఉన్న పాత మోటార్ పంపును తొలగించి, నూతన మోటార్ పంపును మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగకు వేలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో తాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ నూతన డ్రైన్ నిర్మాణం చేపట్టామని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పనులను పూర్తిచేశామని చెప్పారు. అలాగే స్లాటర్ హౌస్ పనులను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పందిరి రమేష్, నునుగొండ నరేష్, గుడికందుల అజయ్, నాయకులు జక్కం బాబు, ఆలయ అర్చకులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా

# ఆడేపు విక్రమ్ నియామకం

## - పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడి

అయినవోలు, ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి):

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా మోర్చా కమిటీల నియామకాల్లో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గం, అయినవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆడేపు విక్రమ్‌ను బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆడేపు విక్రమ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతికుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ వర్గాలకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీ వర్గాలకు చెందిన నాయకులకు స్థానం కల్పించడం పార్టీ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. తెలంగాణలో కూడా భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రిని చేయడమే పార్టీ లక్ష్యమని, బీసీ వర్గాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో సిద్ధాంతాల కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, తనకు వచ్చిన ఈ పదవి



అందుకు నిదర్శనమని అన్నారు. ఈ అవకాశం కల్పించడంలో సహకరించిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, డాక్టర్ టి. రాజేశ్వర్, వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నా ప్రభాకర్, వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, పంతిని సర్పంచ్ కన్నయ్య, అయినవోలు మండల అధ్యక్షులు మాదాసు ప్రణయ్‌తో పాటు మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయవద్దు

## - డీసీసీ జగిత్యాలజిల్లా అధ్యక్షులు నందయ్య



ఇబ్రహీంపట్నం ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి ) కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహి స్తున్న ఎస్ ఐ ఆర్. కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు ఆషామాషీగా తీసుకోవద్దని నిర్లక్ష్యంగా ఉండవద్దనిపకడ్బందీగా పని చేసి కోరుట్ల నియోజకవర్గం లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని అన్నారు.ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సర్ కార్యక్రమంపై జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు నిర్వహించారు 100% ఫలితాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లనునందయ్య జువ్వా డి కృష్ణారావులు ఘనంగాసన్మానించారుఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి సర్పంచ్ లువార్డ్ సభ్యులు మహిళా,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

గొల్లపల్లి ఆగస్టు 03 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలం భీం రాజుపల్లి,ఇబ్రహీం నగర్, రాఘవపట్నం,మల్లన్నపేట,దమ్మన్నపేట అంగన్వాడీ కేంద్రలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్వాడీ కేంద్రలలో తల్లిపాల ప్రాముఖ్యతను సూపర్వైజర్ లు తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని 6 నెలల వయస్సు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఇతర ద్రవపదార్థాలు తేనె ఇవ్వకూడదని రెండు సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యే వరకు అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని



తల్లులు కూరగాయలు,ఆకు కూరలు ,బీట్ రూట్, క్యారెట్,మునగ,పప్పు దినుసులు ,ప పండ్లు,కోడిగుడ్లు తీసుకోవాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ లు జ్యోతి,జానకి, అంగన్వాడీ టీచర్ లు, రాజ సులోచన ,సుశీల, సైండ్ల రజిత, ఎస్ రమాదేవి ఏ ఎన్.ఎం .బుజ్జమ్మ,గ్రామ సర్పంచ్ లు కాసారపు భవాని అరవింద్ ,కొలగాని శ్రీలత, బుర్ర సుధారాణి, ముదాం గౌతమి ,ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ పంచాయతీ కార్యదర్శిలు గర్భవతులు బాలింతలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు

# చెరుకు రైతు ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



ఇబ్రహీంపట్నం ఆగస్టు0 3( ప్రజా కలం ప్రతినిధి) కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారంగత టిఆర్ఎస్ ప్రభుత్వం మూసి వేయడంతొ చెరకు రైతులు కామారెడ్డి లో ఉన్న ప్రైవేటు చెక్కెర ఫ్యాక్టరీతమ చెరుకు ను తరలించడం వల్ల అదనంగా 400 రూపాయల భారం పడుతుందని చెరుకు రైతులు ఇబ్రహీంపట్నం మండలంలో నిర్వహించిన సర్ పునఃశ్చరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుజువ్వాడి కృష్ణారావు ను కలిసి తమ సమస్యలు తెలిపారు ఈ సందర్భంగా చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోసంసంబందిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు అదేవిధంగాముత్యంపేట లో మూతపడ్డ చక్కెర కర్మగారాన్ని తిరిగి తెరిపించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంద అన్నారు.

# భారత మానవ హక్కుల పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ గా తక్దీర్ అలీ

పెద్దపల్లి,ఆగస్టు 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) దేశవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం,రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా సేవనందిస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అఫ్ ఇండియా ట్రస్ట్ (ఎన్జీవో)తన నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించగా,సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు చైర్మన్ మొహ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో నేషనల్ చైర్మన్, వ్యవస్థాపకులుగా మొహ్మద్ తక్దీర్ అలీ,నేషనల్ వర్కింగ్ చైర్మన్ గా మ్యాకల పర్శరాములు నేషనల్ జనరల్ సెక్రటరీగా సనా,నేషనల్ జాయింట్ సెక్రెటరీగా అశ్రఫ్ సుల్తానా,నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా మేడిపల్లి సాయి రమ్య శ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జస్టిస్–ఈక్వలిటీ–హ్యూమానిటీ అనే నినాదంతో ముందుకు



సాగుతున్న ఈ సంస్థ,రాబోయే రోజుల్లో ప్రతి రాష్ట్రం,జిల్లా,మండలం,గ్రామ స్థాయిలోనూ కమిటీలను విస్తరిస్తూ,ప్రజాక్షేత్రంలో మానవ హక్కులపై అవగాహన కల్పించడం,ఉచిత న్యాయ సహాయం అందించడం,మహిళలు– చిన్నారులు–అణగారిన వర్గాల సంక్షేమం కోసం పాటుపడటం మరియు విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం వంటి సేవలను మరింత ఉత్సాహంగా కొనసాగించనున్నట్లు నూతన జాతీయ కమిటీ స్పష్టం చేసింది.

## ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



పెద్దపల్లి,ఆగస్టు08:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ కాంట్రాక్టర్ ఏ.కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా..ఉపాధ్యక్షుడిగా చెప్పాల సమ్మయ్య,ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్,కోశాధికారిగా ఎన్.రాజిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వి.శ్రీనివాస్ గౌడ్,అలాగే కార్యవర్గ సభ్యులుగా రాధయ్య,పిల్లి రాజు,ఎస్.గురువయ్య, గుమ్మడి అంజయ్య,డి.స్రవంతి,ఎం.శంకర్ తదితరులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలుపగా,అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



పెద్దపల్లి,ఆగస్టు 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి పట్టణంలో గోదావరిఖనికి చెందిన పద్మ అనే మహిళ సోమవారం షాపింగ్ మాల్‌లో పెళ్లి సామాను కొనుగోలు చేసి ఆటోలో ప్రయాణిస్తూ తన బ్యాగ్‌ను బస్ స్టాండ్ వద్ద మరిచిపోగా,తుర్కల మద్దికుంటకు చెందిన ఆటో డ్రైవర్ సత్యం దానిని గుర్తించి వెంటనే పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రయాణికులను గుర్తించి సుమారు 20 వేల రూపాయల విలువైన ఆ వస్తువుల బ్యాగ్‌ను వారికి సురక్షితంగా అందజేయగా,తన నిజాయితీతో ఆదర్శంగా నిలిచిన ఆటో డ్రైవర్ సత్యంను ఎస్ఐ నరేష్ అభినందించారు.

## ప్రజారోగ్య సేవల్లో నాణ్యతే లక్ష్యం

- డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డి - నూతన డీఎంహెచ్‌వోకు ఘన సన్మానం
- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమర్థ అమలుకు వైద్య అధికారులకు దిశానిర్దేశం



ఆగస్టు 3 ప్రజాకలం ప్రతి నిది: (వరంగల్)

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. బి. రాజా రెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు, జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, ఎం.ఎల్.హెచ్.పి. వైద్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని వైద్య అధికారులు, ఎం.ఎల్.హెచ్.పి.లు ప్రజారోగ్య సేవల పట్ల అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. శాఖాపరమైన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, తన పరిధిలో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. రాజమౌళి, డా. ఐ. ప్రకాష్, డా. రవీందర్‌తో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, ఎం.ఎల్.హెచ్.పి. వైద్యులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

### తీగారం అంగన్‌వాడీ-1లో తల్లిపాల వారోత్సవాలు..

### తల్లులకు అవగాహన కల్పించిన సిబ్బంది.

ఆగస్టు3 ప్రజాకలంప్రజాప్రతినిధి: (జనగాం /జఫర్ ఘడ్)ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తీగారం గ్రామంలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ సిబ్బంది విస్తృతంగా వివరించారు.శిశువు జన్మించిన వెంటనే అరగంటలోపు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, పుట్టిన తర్వాత వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి టీకా వంటివని తెలిపారు. ఈ పాలలో ఉండే పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే గుణాలు శిశువును అనేక రకాల అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. జననం నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు, తేనె లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలని, అయితే రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా తల్లి ఆరోగ్య పరిరక్షణకు కూడా దోహదపడతాయని, ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపెర్ వైజర్ అనిత టీచర్ కలకోట ఇందిరా ఎ ఎన్ ఎమ్ లు,ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకున్నారు.



## కళాకారులకు పెద్దన్న.. పేదలకు భరోసా ఈగ మల్లేశం

### 'స్వరాభిషేకం' వేదికపై ఈగ మల్లేశం - సంగీత దంపతులకు ఘన సన్మానం

### -నాలుగు దశాబ్దాల కళా, సామాజిక సేవకు గుర్తింపు

(వరంగల్) ఆగస్టు 03 ప్రజాకలం ప్రతినిధి:

కళాకారుల సంక్షేమం, నిరుపేదలకు అండ, విద్యార్థులకు విద్యాసహాయం, సామాజిక సేవలో నాలుగు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న కళాసేవ రత్న అవార్డు గ్రహీత, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ మాజీ డైరెక్టర్ శ్రీ ఈగ మల్లేశం గారు, ఆయన సతీమణి సంగీత దంపతులు 'స్వరాభిషేకం' వేదికపై ఘన సన్మానం అందుకున్నారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గానకోకిల ఎస్. జానకి మధుర స్మృతులను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో గజమాలతో సత్కరించి సన్మాన పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సేవను జీవిత ధ్యేయంగా మలుచుకుని ప్రజా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఈగ మల్లేశం అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షునిగా కళాకారుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మరుగునపడుతున్న జానపద, లిపిలేని కళారూపాల పరిరక్షణతో పాటు కళాకారులకు గుర్తింపు, ప్రోత్సాహం అందించడంలో విశేష పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నటుడిగా, రచయితగా, గాయకుడిగా కళారంగానికి సేవలందించిన ఈగ మల్లేశం, వేలాది నిరుపేద యువజంటల వివాహాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యాసహాయం, పేదలకు గృహనిర్మాణ సహకారం, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించారని గుర్తు చేశారు. నిరుపేద కళాకారులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా కూడా కృషి చేశారని వివరించారు.కరోనా మహమ్మారి సమయంలో సురభి కళాకారులు, ఇతర కళాకారులు, నిరుపేదలకు ఆహారం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించి ఎన్నో కుటుంబాలకు భరోసాగా నిలిచారని తెలిపారు. అఖిల భారత పద్మశాలి జాతీయ అధ్యక్షునిగా చేనేత కుటుంబాల సంక్షేమం కోసం పనిచేస్తూ, వారి సమస్యల పరిష్కారం, వలసల నివారణకు కృషి చేస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'దూంధాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వారిలో ఈగ మల్లేశం కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర రాజకీయ పార్టీల యువజన సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) తొలి కన్వీనర్‌గా సేవలందించారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ ఆశయాల సాధనకు కృషి చేస్తూ, ఆలిండియా అభిమాన సంఘం గౌరవ అధ్యక్షునిగా సేవలందిస్తున్నారని తెలిపారు. కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ డైరెక్టర్‌గా గ్రామీణాభివృద్ధి, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు విశేష సేవలందించారని, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.



"పదవులను అలంకరించడం కాదు... పదవులకు ప్రజోపయోగ పరిమళాన్ని అద్దడమే ఈగ మల్లేశం సేవా తత్వం. ఒక వ్యక్తిని కాదు... ఒక సేవా సంప్రదాయాన్ని సత్కరిస్తున్నాం" అంటూ నిర్వాహకులు ప్రశంసించారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించిన 'స్వరాభిషేకం' కార్యక్రమానికి తొలుత మద్రాస్‌లో తనను ఎంపిక చేశారని, అయితే అక్కడికి వెళ్లలేని పరిస్థితుల్లో ఓరుగల్లు కళాకారులు ఈ సన్మానాన్ని కళలకు పుట్టినిల్లు అయిన వరంగల్‌లో నిర్వహిస్తామని మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ గౌరవాన్ని జీవితంలో మరపురాని గుర్తింపుగా భావిస్తున్నానని, ఈ సన్మానం తన కుటుంబానికే కాకుండా కళాకారులందరికీ దక్కిన గౌరవమని పేర్కొన్నారు. కళాకారుల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## తల్లిపాలే శిశువుకు అమృతధార

- తొలి గంటలోనే తల్లిపాలు పట్టించాలి
- కట్ర్యాలలో తల్లిపాల వారోత్సవాల్లో అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ సూచన

(వరంగల్ /వర్ధన్నపేట) ఆగస్టు 3 ప్రజాకలం ప్రతినిధి: శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే అమృతధారలని, పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ పేర్కొన్నారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రాజెక్టు ఇల్లంద సెక్టార్ పరిధిలోని కట్ర్యాల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను గ్రామ సర్పంచ్ రమ అధ్యక్షతన, అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ.. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పుట్టిన మొదటి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలనే అందించాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. తల్లిపాలు తాగే పిల్లల్లో



శారీరక ఎదుగుదల, మెదడు అభివృద్ధి మెరుగ్గా ఉండటంతో పాటు న్యూమోనియా వంటి పలు వ్యాధుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయని వివరించారు.బాలింతలు కూడా పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగాలని, తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువుకు సరిపడా తల్లిపాలు అందించగలుగుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## కన్న కూతుళ్ల చేతిలోనే వృద్ధ దంపతులకు అన్యాయం

### లింగమోరి గూడెం ఘటన సమాజానికి హెచ్చరిక - నిజానిజాలు తేల్చాల్సిన బాధ్యత అధికారులదే



ఆగస్టు 3 అయినవోలు:- (ప్రజా కలం ప్రతినిధి)

అయినవోలు మండలం లింగమోరి గూడెం గ్రామంలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న భూ వివాదం మరోసారి కుటుంబ బంధాలు, ఆస్తి వ్యవహారాలు ఎంతటి విషాదాలకు దారితీస్తాయో గుర్తు చేస్తోంది. జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తి చివరికి కన్న కూతుళ్ల చేతుల్లోనే వివాదానికి కేంద్రబిందువవడం బాధాకరం.

**వృద్ధ దంపతుల కథనం...** ప్రకారం అయినవోలు మండలం లింగమూరి గూడెం గ్రామానికి చెందిన గజ్జెల్లి (సమ్మాలు)సమ్మయ్య భద్రమ్మ దంపతులకు సునీత సుకన్య వాణిశ్రీ సుజాత శ్రీలత అనే ఐదుగురు కుమార్తెలు, గజ్జెల్లి రాజు అనే కుమారుడు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం కుమారుడు రాజు అనారోగ్యంతో 2018లో మరణించడంతో కుటుంబ పరిస్థితులు మారిపోయాయి. సమ్మయ్యకు లింగమారి గూడెం గ్రామంలో 165, 166 సర్వే నెంబర్లలో మూడు ఎకరాల 15 గుంటలు వ్యవసాయ భూమి కలదు. ఉన్న ఒక్క వారసుడు చనిపోవడంతో పరిస్థితిని ఆసరాగా చేసుకుని, కూతుర్లు కోడలిపై లేనిపోని మాయమాటలు చెప్పి మిమ్మల్ని మేమే సాదుతం అని చెప్పి వృద్ధ దంపతులను తీసుకెళ్లిన కూతుర్లు రైతు బీమా పేరు చెప్పి తమ కుమారుల సహాయంతో 2020లో మూడు ఎకరాల భూమిలో తలా 20 గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. అనంతరం పట్టాలు పొందిన వారు ఇన్నాళ్లు భూమిని కౌలుకు చేస్తున్నామని వృద్ధ దంపతుల నమ్మించి కొద్దికాలం క్రితం భూమిని వరంగల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి భయానాగా 8 లక్షల రూపాయలు తీసుకొని అమ్మే ప్రయత్నం జరుగుతోందని వారు వాపోతున్నారు. గత వారం స్లాట్ బుక్ చేసుకుని, సోమవారం అయినవోలు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరగనున్నట్లు తెలుసుకున్న వృద్ధ దంపతులు, తమ వయస్సును కూడా లెక్కచేయకుండా కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వేడుకున్నారు.

వారి విన్నపాన్ని శ్రద్ధగా విన్న తహసీల్దార్ విక్రమ్ కుమార్, వివాదం ఉన్న నేపథ్యంలో ఈరోజు రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసి, తదుపరి సీనియర్ సిటిజన్ ఆక్ట్ ప్రకారం విచారణ కోసం ఆర్‌డీఓకు విషయం పంపించడం అభినందనీయమైన చర్యగా చెప్పుకోవచ్చు. అయితే ఈ సంఘటన కొన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. నిజంగా వృద్ధుల సమ్మతి లేకుండా భూమి బదిలీలు జరిగాయా? కౌలు పేరుతో జరిగిన రిజిస్ట్రేషన్లు చట్టబద్ధమేనా? రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయి? సంబంధిత అధికారులు అప్పట్లో తగిన పరిశీలన చేశారా? వంటి అంశాలపై సమగ్ర విచారణ అవసరం. ఆస్తి కోసం కన్నవారినే మోసం చేశారనే ఆరోపణలు నిజమైతే అది కేవలం ఒక కుటుంబ సమస్య కాదు; సమాజం విలువలు ఎటు సాగుతున్నాయో చెప్పే ఆందోళనకర పరిణామం. తల్లిదండ్రులను ఆదుకోవాల్సిన సంతానం వారినే న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి నెట్టివేస్తే, అది ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విషయం. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, పత్రాల చట్టబద్ధత, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, అన్ని పక్షాల వాదనలు పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. వృద్ధ దంపతులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రెవెన్యూ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళులు

### నాలుగో రోజు నివాసానికి చేరుకున్న పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

### ప్రజాసేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



ఆగస్టు 3 ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్ /నర్సంపేట) నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం పట్ల పలువురు రాజకీయ, ప్రజా ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి నివాళు లర్పించేందుకు నాలుగో రోజు సోమవారం నల్లబెల్లిలోని ఆయన నివాసానికి చేరుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాజీ టీఎస్‌కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భరత్‌కుమార్‌రెడ్డి, టీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు సారంగపాణి, మాజీ జెడ్పీటీసీ హరినాథ్‌సింగ్, డాక్టర్ చిరంజీవి మోటె, నాయకులు సముద్రాల మధు, వేణుగోపాల్‌రెడ్డి, పిల్లల నాగరాజు, భాస్కర్, తెలంగాణ విజయ్ తదితరులు నివాళులర్పించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతి ప్రజలకు తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## అక్రమంగా రోడ్డు ఆక్రమిస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు

హనుమకొండ ఆగస్టు 3 ప్రజా కలం ప్రతినిధి

హనుమకొండ లక్ష్మీపురం న్యూ బస్టాండ్ సమీపంలోని కాలనీలో రాజబాబు గందె కృష్ణ అనే వ్యక్తులు తన ఇంటి స్థలం కు ఆనుకొని ఉన్న రోడ్డు పై ప్రహరి గోడ నిర్మించి రోడ్డును ఆక్రమించారని... ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని కాలనీవాసులకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని



ఇన్చార్జి కలెక్టర్ రవికి ప్రజావాణిలో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదును వెంటనే సంబంధిత జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ కు అప్పగించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నవీన్, శీను,సతీష్,చిదరాల శ్రీను, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల ఆరోగ్య క్షేమమే మా లక్ష్యం

### హెచ్ పి వి టీకాను వేసుకుందాం - క్యాన్సర్ ను దూరం చేద్దాం

### సర్పంచ్ వై.శైలజా శ్రీనివాస్ రెడ్డి

ప్రజా కలం ఆగస్టు 3 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి. మహేష్ అధ్యక్షతన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి,హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ



కార్యక్రమంలో సర్పంచ్,ఎంఎల్ హెచ్ పి మాట్లాడుతూ....14, 15 సంవత్సరాల వయసు నిండిన బాలికలికలు ప్రతి ఒక్కరు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పకుండగా వినియోగించుకోవాలని అన్నారు.ఈ యొక్క హెచ్ పి వి వ్యాక్సిన్ క్యాన్సర్ రోగానికి ఉపయోగపడుతుందని అన్నారు. గర్భాశయ ముఖద్వారం ద్వారా ఏర్పడే క్యాన్సర్ బారిన పడకుండగా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అందుకు ఈ యొక్క టీకా వాడుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక హెల్త్ సిబ్బంది, ఆశ వర్కర్లు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండ్లు ఇచ్చారు... నీళ్లు మరిచారు

- నీళ్లు లేక ప్రజలు అవస్థలు
- తాగునీటి సౌకర్యం కల్పించాలని లబ్దిదారుల వినతి

ప్రజా కలం ఆగస్టు 3 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇటీవల అర్హులైన 25 మంది లబ్దిదారులకు పంపిణి చేశారు.అసంపూర్తిగా నిర్మించిన ఇళ్లలో సరైన వసతి లేకపోవడంతో లబ్దిదారులు సొంత ఖర్చులతోనే పనులు పూర్తి చేసుకుంటున్నారు. కనీస అవసరాల కోసం నీరందించేందుకు పైప్ లైన్ నిర్మించకపోవడంతో లబ్దిదారులు వ్యవసాయ పొలాల వద్ద తాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా త్రాగు నీటిని అందించాలని గ్రామస్తులు, అధికారులను కోరుతున్నారు.



## శ్రీనన్న ఆత్మీయ భరోసా.. ప్రతి పేద కుటుంబ నమ్మకానికి ప్రతీక

### పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 44 కుటుంబాలకు రూ.10,000/ రూపాయల ఆర్థిక భరోసా.



పాలేరు ఆగష్టు 03( ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండలం పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం నేలపట్ల, లోక్య తండా, గంగ బండ తండ, గట్టుసింగారం, మల్లెపల్లి, పెరక సింగారం, హిరమన్ తండ, నాయకన్ గూడెం, పాలేరు, సంధ్య తండ, గైగోలపల్లి, పోచారం, ముత్యాల గూడెం, కేశవపురం, తురకగూడెం,కూసుమంచి గ్రామాలలో వివిధ కారణాలతో మరణించిన 44 కుటుంబాలకు ౹ూా= చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కుటుంబ పెద్ద ను కోల్పోయి కష్ట సమయంలో మమ్మల్ని ఒంటరిగా వదిలేయకుండా మా కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మంకెన వాసు, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి,మాజీ సర్పంచ్ చాట్ల పరుశురాం, కొర్ర రమేష్, కొత్త పుల్లారెడ్డి, సర్పంచ్ లు వడిత్య వెంకటేష్ నాయక్, బాదావత్ నరేష్, యువజన విభాగం శేఖర్ రెడ్డి, మహమ్మద్ రఫీ ఆయా గ్రామ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### - ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, ఆగస్టు 03(ప్రజా కలం న్యూస్ )

ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

పాలేరు ఆగష్టు 03(ప్రజా కలం న్యూస్ ) కూసుమంచి మండల పరిధిలోని సోమవారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు వడిత్య బాలక్రిష్ణ, తాతయ్య బిచ్చ, ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, సోమవారం లింగారం తండా నందు బిచ్చ,చిత్ర పట్టానికి పూలమాలలు వేసి,నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల మరణించిన గోరీలపాడు తండాబానోత్ మాన్ సింగ్ నాయక్ రాజు తండా భూక్యా కోటయ్య, నాయక్,వాంకుడొత్ దేవ్జ్య, కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, పలు సర్పంచులు, వార్డు మెంబర్స్, మాజీ ఎంపీటీసీలు, వైస్ సర్పంచ్, టిఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఘన సన్మానం అందుకున్న సీనియర్ జర్నలిస్టు ఇజాజ్ అహ్మద్ ఖాన్

### 34 ఏళ్ల విశిష్ట పాత్రికేయ సేవలకు 'తబస్సుమ్ ఫరీది అవార్డు' ప్రదానం్న మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా సత్కారం



నిర్మల్ ఆగస్టు 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ జిల్లా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇజాజ్ అహ్మద్ ఖాన్ పాత్రికేయ రంగంలో 34 ఏళ్లుగా అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక 'తబస్సుమ్ ఫరీది అవార్డు' తో సహా పదివేలు బహుమతి అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీలో ఫెడరేషన్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, టీఎంఆర్ఎంఐ ఉపాధ్యక్షుడు ఫహీమ్ ఖురేషీ చేతుల మీదుగా ఆయనకు మొమెంటో, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏ. మాజిద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ మొహియుద్దీన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇజాజ్ అహ్మద్ ఖాన్‌కు అవార్డు లభించడంతో పాత్రికేయులు, బంధుమిత్రులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలో ఉన్న సీనియర్ జర్నలిస్టు మహ్మద్ షాహిద్ అహ్మద్ తవక్కల్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వసీం తష్కీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ ఖాన్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇజాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా ఉర్దూ పాత్రికేయులందరి సేవలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ఆగష్టు 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.



కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులంతా తప్పనిసరిగా ప్రభుత్వ విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు. తనిఖీ వివరాల నివేదికలు సంబంధిత యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ పాఠశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




ప్రజా కలం ఆగస్టు 3 (గద్వాల ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పి యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్ లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు 216 మంది నూతన విద్యార్థులు ప్రవేశం పొందగా, నేటి వరకు మొత్తం విద్యార్థుల నమోదు 726కు చేరుకుంది.ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 60 అడ్మిషన్స్ రావటం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతనంగా చేరిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పీ యం శ్రీ పథకం ద్వారా నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన పాటలు, నృత్యాలు, ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కొత్తగా చేరిన విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పాఠశాలలో లభించిన ఆత్మీయ స్వాగతానికి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగతంగా పాల్గొని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. సురేష్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఫ్రెషర్స్ డే వేడుకలను విజయవంతం చేశారు.

## నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

### పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష

### ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు ఆదేశం



నిర్మల్ ఆగస్టు 03(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు రూమ్‌తో పాటు స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మల్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా మిత్ర పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఎస్ఐలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అఖండ భజన సప్తాహ కరపత్రం ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండ్ల



ప్రజా కలం ఆగస్టు 3 (గద్వాల ప్రతినిధి)

గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సోమవారం మల్దకల్ మండలం కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు అఖండ భజన సప్తాహ కార్యక్రమము తేదీ : 8-08-2026 శనివారం నుండి 15-08-2026 శనివారం జరిగే అఖండ జ్యోతి సప్తాహ భజన కరపత్రము ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఎమ్మెల్యేకి సర్పంచ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛ ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూసకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటలు మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి గద్వాల సస్యశ్యామలముగా ఉండాలని కోరుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో కలిగి ఉండాలని ఈ సప్తాహ భజన దేవాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.

ఈ సప్తహ భజన కార్యక్రమమును దిగ్విజయము చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాద రావు, జిల్లా కన్వీనర్ నల్లారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న నరేందర్, మధునాయకి, తిమ్మరాజు, పరుశరాముడు, నాగరాజు, నారాయణ, నర్సింహులు, ప్రవీణ్, తిమ్మప్ప, శ్రీను, రాజు, కృష్ణమూర్తి , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

### - రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.

నిర్మల్ ఆగస్టు 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా డిజిటలైజేషన్ చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల




రేషనలైజేషన్ ( హేతుబద్ధీకరణ) ప్రక్రియలపై జిల్లాల వారిగా సమీక్షించారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే, వారిని ఒకే పోలింగ్ కేంద్రం కిందకు వచ్చేలా రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ఆగస్టు 03(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.



సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని, పరిష్కారం కాని వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని, ప్రజల వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భూముల సర్వే, రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అన్ని శాఖలు

# సమన్వయంతో పనిచేయాలి




### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 3 :

జిల్లాలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నాణ్యతతో రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానంలో జిల్లాకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్-2026ను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి శాఖపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ, మండల పంచాయతీ, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల సమన్వయంతో రూపొందించాలని తెలిపారు. ఈ ప్రణాళికల్లో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితర భాగస్వాములందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. జిల్లా, మండల స్థాయిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు గ్రామ స్థాయిలో గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, మహిళా మరియు శిశు సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న నిధులు, చేపట్టే కార్యకలాపాల వివరాలను డేటా కలెక్షన్ ఫార్మాట్ల ద్వారా గ్రామ, మండల స్థాయి అధికారులకు అందించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు గ్రామసభలు, మండలసభల్లో తప్పనిసరిగా పాల్గొని నాణ్యమైన ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులందరూ తమ పరిధిలోని మండల, గ్రామ స్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈసారి గ్రామాభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానం అమల్లో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీలు రూపొందించే ప్రణాళికలు ఏ, బి, సి, డి గ్రేడ్లలో ఏ స్థాయిలో ఉన్నాయో ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని శాఖల కార్యక్రమాలు, పథకాలు, నిధులు, కార్యకలాపాలు సమగ్రంగా ప్రణాళికల్లో పొందుపరిస్తేనే అత్యుత్తమ గ్రేడ్ సాధించవచ్చన్నారు. శాఖల వారీగా అమలు చేస్తున్న పథకాల కార్యనిర్వహణ, నిధుల విడుదల, చెల్లింపులు, అమలు ప్రక్రియలో ఎలాంటి మార్పు ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా శాఖల కార్యాచరణ యథావిధిగా కొనసాగుతుందని, గ్రామాభివృద్ధి ప్రణాళికలో కేవలం సమగ్ర సమాచారాన్ని పొందుపరచడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని తెలిపారు. ఈ విషయాన్ని అన్ని స్థాయి అధికారులకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ.నిర్మల, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్.పి. సి. ఈ. ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓనరసింహులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

మహబూబ్‌నగర్ జిల్లా: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుంచి 7 వరకు) సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్,జె.ఎల్.బి.హరిప్రియ,అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జరీన్ బేగం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీవోలు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఐఏఎస్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని తెలిపారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం - సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జరీన బేగం మాట్లాడుతూ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి, శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలిచ్చే అలవాటును ప్రోత్సహించాలని, అలాగే మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించాలని కోరారు.

## డి.సి.సి.బి నూతన సిఈఓగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ షఫీఉల్లా ఖాన్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 3: మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డి.సి.సి.బి) నూతన ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సి. ఈ.ఓ)గా మహమ్మద్ షఫీఉల్లా ఖాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లాలో సహకార బ్యాంకు సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేలా కృషి చేయాలని అన్నారు.



## తల్లిపాల వారోత్సవాలను

# విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**- ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**- మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం**

**- తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి**

**- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, ఆగస్టు 03(ప్రజా కలం న్యూస్ )

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించేలా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు.

ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటే బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా పానీయం ఇవ్వక పోవడమేనని తెలిపారు. ఈ కాలంలో నీరు, పైపాలు, పాలపొడి లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, వైద్యుల సూచన లేకుండా పాల పొడి లేదా డబ్బా పాలను వినియోగించరాదని సూచించారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి, ప్రాజెక్టు స్థాయి, అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గీతన్నల గోడు వినండి..!

**- సంక్షేమానికి కేటాయించిన రూ.67 కోట్లు వెంటనే విడుదల చేయాలి**

**- నీరా అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి అల్టిమేటం**

**- మరిపెడలో గీతన్నల చైతన్య బస్సు యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ డిమాండ్**

ప్రజాకలం మరిపెడ ఆగస్టు 3

గీతా కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.67 కోట్ల నిధులను, నీరా అభివృద్ధికి కేటాయించిన రూ.25 కోట్లను వెంటనే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గీతన్నల చైతన్య బస్సు యాత్రలో భాగంగా సోమవారం మరిపెడ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రకు ప్రజాసంఘాల నాయకులు, గీతా కార్మికులు ఘన స్వాగతం పలికి సంఘీంభావం ప్రకటించారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య బస్సు యాత్ర ద్వారా గీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని, వృత్తి ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు.

వృత్తి ప్రమాద బాధితులకు ఇవ్వాల్సిన రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇప్పటికీ విడుదల కాలేదని, 50 ఏళ్లు నిండిన గీతా కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్త దరఖాస్తులు స్వీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్త హామీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇప్పటికే ఇచ్చిన హామీలనే అమలు చేయాలని స్పష్టం చేశారు.



ఏజెన్సీ ప్రాంతాల్లో మూతపడిన గీతా సహకార సంఘాలను పునరుద్ధరించి, అక్కడి కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "కాటమయ్య రక్షణ కవచం" రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన 2.30 లక్షల గీతా కార్మికుల్లో కేవలం 30 వేల మందికే అందిందని, అర్హులైన ప్రతి గీతా కార్మికుడికి వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి సహకార సంఘానికి ఐదు ఎకరాల భూమి కేటాయించి తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని, నందనంలోని నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌనీ వెంకన్న, జిల్లా కార్యదర్శి యమగాని వెంకన్న, బిక్కి వెంకటేశ్వర్లు, గౌనీ సాంబయ్య, బుర్ర సుధాకర్, తాళ్లపెల్లి నరసయ్య, వీరగాని శ్రీనివాస్, మొగుళ్ల యాకన్న, గాదగాని నాగన్న, జగదీష్, బోడపట్ల రాజశేఖర్, కెవిపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ దుండి వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బాణాల రాజన్న, రైతు సంఘం నాయకుడు అనంతచారి, గీతా కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మం రూ.12 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 03(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధి 29వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో రూ.12 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నేడు (ఆగస్టు 4) ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. కాటన్ మార్కెట్ నుంచి శ్రీనివాస్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు ఈ బీటీ రహదారిని రూ.12 కోట్లతో మంజూరు చేయగా, రహదారి నిర్మాణం పూర్తయితే ప్రకాశ్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి.



## ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 3 :

జిల్లాలో ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ పామ్ రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ, జిల్లాలోని ఆయిల్ పామ్ తోటల మీదుగా వెళ్తున్న హైటెన్షన్, లోటెన్షన్ విద్యుత్ లైన్ల వల్ల షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ గెలలను కోసే కూలీల భద్రతకూ ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

దీనిపై స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 249 మంది రైతులకు చెందిన 1,090 ఎకరాల ఆయిల్ పామ్ తోటల్లో విద్యుత్ లైన్ల సమస్య ఉన్నట్లు అధికారులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

సమావేశంలో రైతులు యూరియా ఎరువులను ఏడాది పొడవునా అందుబాటులో ఉంచాలని, స్లాషర్లు, మల్చర్లు వంటి వ్యవసాయ యంత్రాలను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అడవి పందుల నుంచి లేత ఆయిల్ పామ్ తోటలను రక్షించేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా అండర్‌గ్రౌండ్ డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రస్తుతం అమలులో ఉన్న 12.5 ఎకరాల సీలింగ్ పరిమితిని తొలగించాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, రైతు క్షేత్రాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలను అందుబాటులో ఉంచాలని కోరారు.




తక్కువ నీరు ఇస్తున్న బోరుబావులు ఉన్నవారికి నీటిని నిల్వ చేసుకునేందుకు లైనింగ్‌తో కూడిన ఫార్మ్ పాండ్లను అధిక సంఖ్యలో మంజూరు చేయాలని కూడా అభ్యర్థించారు.

రైతుల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్, జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధానపరమైన, పాలనాపరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. వేణుగోపాల్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ చక్రవర్తి, ఫ్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌రావు, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.



## గాయపడిన మున్సిపల్ కార్మికుడికి అండగా నిలిచిన కౌన్సిలర్ గోలి మమత సంతోష్

గజ్వేల్:03 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు మల్లయ్య ఇటీవల కాలుకు తీవ్ర గాయం కావడంతో వారం రోజులుగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ సోమవారం మల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లయ్యకు ధైర్యం చెప్పిన కౌన్సిలర్, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మున్సిపల్ కార్మికులు ప్రజల సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కౌన్సిలర్ చూపిన మానవతా దృక్పథానికి మల్లయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు...

### సత్వర పరిష్కారమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:03 ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి)

ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ




సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన 118 దరఖాస్తులను పరిశీలన కోసం సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వం సంబంధిత శాఖలకు పంపించిందని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించి నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచే శాఖలపై జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే జిల్లా స్థాయిలో స్వీకరించిన అర్జీలను కూడా వేగంగా పరిష్కరించి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై బ్రహ్మకుమారీస్ సంస్థ రూపొందించిన 'నషా ముక్తి భారత్ అభియాన్' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిస్తూ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్వో నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## భవన నిర్మాణ కార్మిక సంఘానికి నష్టపరిహారం చెల్లించాలి. సిపిఐ పార్టీ




గజ్వేల్:03 ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు కారణంగా నష్టపోయిన పల్లెపహాడ్ గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివలింగ కృష్ణ మాట్లాడుతూ, మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పల్లెపహాడ్ గ్రామంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం ముంపునకు గురైనప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం అందించలేదని ఆరోపించారు. అలాగే గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో భవన నిర్మాణ కార్మిక సంఘానికి ఒక స్థలం లేదా ఫ్లాట్ కేటాయించి, సంఘ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లెపహాడ్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గూడూరు స్వామి, ఉపాధ్యక్షుడు శనిగరం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శివలింగ స్వామి, సహాయ కార్యదర్శి రుద్రారం మల్లేశం, ఎల్లం భూమయ్య, పోచయ్య, మల్లేశం, సాయిలు, రాజయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు కార్యాచరణ !

- అర్హులైన జర్నలిస్టు లందరికీ ఇంటి స్థలం, హెల్త్ కార్డులు ఇవ్వాలి.
- అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పణ.
- త్వరలో అన్ని నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటు .
- టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కార్యవర్గంలో తీర్మానాలు.




సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 03 ( ప్రజా కలం):

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు వచ్చేవరకు నిరంతరం పోరాటం కొనసాగించాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీ యూడబ్ల్యూజే- ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ తీర్మానించింది. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన సదాశివపేట లో సోమవారం జిల్లా కార్యవర్గ తొలి సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. అంతేకాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు. ఇంటి స్థలం, హెల్త్ కార్డు, యూనియన్ భవనం గురించి అధికారులను ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలను సమర్పించాలని తీర్మానించినట్టు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ప్రకటించారు. సంగారెడ్డి తో పాటు , జహీరాబాద్, సదాశివపేట నారాయణఖేడ్ జోగిపేట పటాన్చెరు నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. హత్నూర లో కూడా త్వరలో కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని సమావేశం నిర్ణయించింది. మిగిలిన జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. కేబుల్ టీవీ జర్నలిస్టులకు తక్షణమే ఒక యూనిట్ అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించేది లేదని అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా ఇతరులను కలుపుకొని పోవాలని సూచించారు. మన ఐక్యతే మన విజయానికి సూత్రం అని చెప్పారు. జర్నలిస్టుల హక్కులను సాధించడానికి రాజీ లేని పోరాటం శరణ్యమని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఈ సందర్భంగా అన్నారు. ఈ విషయంలో జర్నలిస్టులు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, వికాసం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. నాటి నుంచి నేటి వరకు జర్నలిస్టుల పక్షాన నికార్సుగా నిలబడి కొట్లాడుతున్న సంఘం గా టీయూడబ్ల్యూజే-ఐజే యు నిలుస్తుందని చెప్పారు. సంగారెడ్డి లో జరిగిన జిల్లా మహాసభను రాష్ట్రస్థాయిలో విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కష్టపడితే ఏదో ఒక రోజు కచ్చితంగా గుర్తింపు వస్తుందని తెలిపారు. తన అనుభవాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. జిల్లా కోశాధికారి అన్వర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్ ,ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్, ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు బాసిత్, ఐజేయూ సభ్యుడు సిద్ధన్న పాటిల్, సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, మతీన్, సత్యనారాయణ రెడ్డి, కిషోర్ మల్లేశం, సంయుక్త కార్యదర్శులు ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుమన్ తో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీలు విల్సన్ ,ఆంజనేయులు ఉల్వాల రాజు, శివన్న జైన్, ఇర్షన్ ,సదాశివపేట జర్నలిస్టులు నరేష్ , విశ్వనాథ్ జయ రాములు, లింగం, జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముప్పు తిప్పలు పెడుతున్న బెంగాల్ టైగర్

### పులి వేట కోసం అధికారుల మాటు..
### రిస్క్యూ టీమ్‌తో అప్రమత్తంగా నిరీక్షణ



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

అటవీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతంలోకి వచ్చిన బెంగాల్ టైగర్‌ను సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు, కర్ణాటక రిస్క్యూ టీమ్ ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గత మూడు రోజులుగా బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలోని తోటల్లో సంచరిస్తూ అధికారులకు ముప్పు తిప్పలు పెడుతున్న ఈ పెద్దపులి సోమవారం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం శివారులోని జల్లేరు వాగు సమీపంలోని పామాయిల్ తోటలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. పులి అక్కడే ఉండటంతో రోజంతా అధికారులు అప్రమత్తంగా కాపలా కాశారు. మరోవైపు పులిని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తుండటంతో వారిని అదుపు చేయడంలో పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు.

పులికి ఎలాంటి హాని జరగకుండా చర్యలు.. వన్యప్రాణి అయిన పులికి ఎట్టి పరిస్థితుల్లోనూ హాని జరగకుండా సురక్షితంగా బంధించాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పులి జాడ తెలిసినప్పటికీ దానికి ఎలాంటి నష్టం కలగకుండా మత్తు ఇంజక్షన్‌తో అదుపులోకి తీసుకుని తిరిగి పాపికొండల అభయారణ్యంలో విడిచిపెట్టడమే అటవీ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో రాజమండ్రి సమీపంలో పట్టుబడిన ఇదే పులిని ట్రాకర్ కాలర్ అమర్చి పాపికొండల అడవిలో వదిలిపెట్టిన విషయం తెలిసిందే. ఆ ట్రాకర్ ద్వారానే ప్రస్తుతం పులి కదలికలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నారు. మూడు నెలలపాటు అధికారులకు ముప్పు తిప్పలు పెట్టిన తర్వాత పట్టుబడిన ఈ పులి, ట్రాకర్ అమర్చిన అనంతరం తిరిగి అదే మార్గంలో పోలవరం ప్రాంతానికి చేరుకుని, గత వారం రోజులుగా రిస్క్యూ బృందానికి సవాల్ విసురుతోంది. పోలవరం ప్రాంతం నుంచి సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి చేరుకున్న పులి, శనివారం మర్లగూడెం అడవి నుంచి దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించి జంగారెడ్డిగూడెం పరిసర తోటల్లో సంచరిస్తోంది.

డ్రోన్లు, ట్రాకర్‌తో గాలింపు..

ట్రాకర్ సంకేతాల ఆధారంగా పులి కదలికలను గమనిస్తున్న అధికారులు, అది సమీపానికి వస్తే మత్తు ఇంజక్షన్‌తో అదుపులోకి తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం ప్రత్యేక గన్‌లను సిద్ధం చేశారు. అలాగే బోనును ఏర్పాటు చేసి సరైన అవకాశంకోసం వేచి చూస్తున్నారు. డ్రోన్ల సహాయంతో కాలువలు, గట్లు, తోటల పరిసరాల్లో విస్తృతంగా గాలింపు కొనసాగిస్తున్నారు.

ఫీల్డ్‌లోనే ఉన్నతాధికారులు..

జంగారెడ్డిగూడెం రూరల్ మండలం మైసన్నగూడెం శివారులోని జల్లేరు వాగు సమీపంలో రోజంతా రాజమహేంద్రవరం అటవీ కన్జర్వేటర్ జ్యోతి, ఏలూరు డీఎఫ్‌వో సందీప్ రెడ్డి, స్థానిక ఎఫ్‌ఆర్‌వో దుర్గాకుమార్ బాబు తదితర అధికారులు పర్యవేక్షించారు. వారితో పాటు కర్ణాటక రిస్క్యూ టీమ్ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది కలిపి సుమారు 50 మంది అక్కడే మకాం వేశారు.

మత్తు ఇంజక్షన్ గన్‌లు, ట్రాకర్ రిసీవర్లు, ఇతర అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచిన అధికారులు, పులిని సురక్షితంగా బంధించి తిరిగి అడవిలో విడిచిపెడతామని తెలిపారు. కాగా, ఆదివారం రాత్రి కూడా పులి ఓ పశువును చంపినట్లు సమాచారం.

## జగన్‌పై అచ్చెన్న ఫైర్!

### వైసీపీ రైతులను మార్కెట్‌కు వదిలేసింది..
### కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది

అమరావతి ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

రైతుల సంక్షేమం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడే నైతిక హక్కు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రభుత్వం ప్రేక్షకపాత్రకే పరిమితమైందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి రైతులను మార్కెట్ కరుణకు వదిలేసిందని ఆరోపించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొగాకు రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని చర్యలు ప్రారంభించిందని తెలిపారు. గత ఏడాది 25 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని చెప్పారు.

ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతులకు లో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుపై కిలోకు రూ.10 ప్రోత్సాహకం అందిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. అలాగే 100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు లక్ష్యంగా చర్యలు చేపట్టామని, ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

ఆగస్టు 15 వరకు పంటల బీమా గడువు

రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఖరీఫ్-2026 పంటల బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను కేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిర్ణయం సాధ్యమైందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతులకు కీలక రక్షణగా నిలుస్తుందని పేర్కొంటూ, రుణగ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా ప్రతి అర్హ రైతు బీమా పథకంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాటలతో కాదు.. చేతలతో రైతులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఆధరణ తగ్గిన జీహెచ్ఎంసీ ప్రజావాణి...

## అధికారుల పై నమ్మకం లేదన్న అనుమానం?

## ఒక వైపు బోనాలు,మరోవైపు వర్షాలు.. మొత్తం 44 ఫిర్యాదుల స్వీకరణ..

హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల ఆధరణ తగ్గుతుందా? అని అనుమాన వ్యక్తమవుతోంది.కేంద్ర కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సేవ కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన లేదా? లేకు అధికారుల అలసత్వానికి స్థానికులు విముకతు వ్యక్తం చేస్తున్నారా అన్న అనుమానం వ్యక్తమవుతుంది. ప్రజా సమస్యలను పరిష్కారం చేయాల్సిన అధికారులు.. నానమాత్రంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజావాణిలో వచ్చే సమస్యలను ఎన్ని పరిష్కారం చేశారు అన్ని విషయానికి సమాధానం లేకపోవడంతో అసలు ఏం జరుగుతోందన్న అనుమానం




వస్తుంది. ఆగస్ట మూడో తేదిన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రారంభలో ఎటువంటి పిర్యాధులు రాలేదు.దీనితో ప్రజావాణి బోసిపోయింది. ప్రజావాణి ముగిసే సమయానికి పిర్యాధుదారులు రావడంతో కాస్త సందడి నెలకొన్నది. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ జోన్ల వారీగా మొత్తం 44 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా ప్రధాన కార్యాలయానికి 32 ఫిర్యాదులు, శంషాబాద్ జోన్ నుంచి 4, చార్మినార్ జోన్ నుంచి 3, రాజేంద్రనగర్ జోన్ నుంచి 2, ఖైరతాబాద్ జోన్ నుంచి 2, సికింద్రాబాద్ జోన్ నుంచి ఒక ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. గోల్కొండ జోన్ పరిధిలో ఒక్క ఫిర్యాదు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఫిర్యాదులు పరిశీలించిన అధికారులు,సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల సిబ్బందిని ఆదేశించారు.

బోనాల సందడి, వర్షాల ప్రభావం..

ఒకవైపు నగరంలో బోనాల వేడుకలు, మరోవైపు వర్షాల కురియడంతో స్థానికులు పిర్యాధు చేసేందుకు ఆలోచన చేస్తున్నారని తెలుస్తుంది. ఇప్పటికే పిర్యాధు చేసిన సమస్య పరిష్కారంకు నోచుకేలదని ఆరోపణలు ఉన్నాయి. దీనితో స్థానికులు అధికారుల తీరు పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో పిర్యాధు చేసేందుకు కాస్త వెనుకాడుతున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అదనపు కమిషనర్లు పరిపాలన, పారిశుద్ధ్యం, నగర ప్రణాళికా ధికారి, ప్రధాన ఇంజనీర్, సంయుక్త కమిషనర్ రెవెన్యూ, ప్రధాన వైద్య,ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలకు అభివృద్ధి బాట

## -గ్రామాల అభివృద్ధికి వేగం.. అధికారులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కీలక ఆదేశాలు..

పటాన్‌చెరు, ఆగస్టు 3 (ప్రజా కలం) ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను



ఆదేశించారు.సోమవారం పటాన్‌చెరు శిబిర కార్యాలయంలో పటాన్‌చెరు, గుమ్మడిదల మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వం నిధులతో పాటు సంస్థల సామాజిక బాధ్యత నిధులను కూడా వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. నందిగామ వాణిజ్య సముదాయం పనులు పది రోజుల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. భానూరు,క్యాసారం,నందిగామ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.గుమ్మడిదల మండలంలోని అనంతారం, కానుకుంట,నూతనకల్, కొత్తపల్లి గ్రామాల్లో అంతర్గత రహదారుల పనులు త్వరలో ప్రారంభమవుతాయని గ్రామీణ రహదారుల శాఖ విభాగాధికారి దీపక్ తెలిపారు.టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను నల్లజాబితాలో చేర్చాలని గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారులు యాదగిరి, ఉమాదేవి, విభాగాధికారి దీపక్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, సహాయ ఇంజనీర్ శశిధర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు..

# పటాన్‌చెరు ఆసుపత్రి ఎప్పుడూ.?

## -పటాన్‌చెరు ఆసుపత్రి ప్రారంభం..

## గాంధారి అభివృద్ధికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్..

పటాన్‌చెరు,ఆగస్టు 3 (ప్రజా కలం) ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవడంతో



పాటు,కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ డా.చిన్నమైల్ అంజిరెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు హైదరాబాద్ సచివాలయంలో సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన అంజిరెడ్డి, పటాన్‌చెరు ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించాలని,గాంధారి ఆసుపత్రికి శాశ్వత భవనం నిర్మించి,అవసరమైన వైద్యులు, వైద్య సహాయక సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 104 సేవల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. తాను ప్రస్తావించిన అంశాలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి,సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి తెలిపారు..

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో దుబ్బాక విద్యార్థుల ప్రతిభ.

## రెండు స్వర్ణాలతో సహా 11 పతకాలు సాధించి జిల్లా ఖ్యాతి చాటిన యువ క్రీడాకారులు.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 03.

హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని చంపాపేట్ లక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రెండో అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. భారత్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మలేషియా తదితర సుమారు 30 దేశాల నుంచి 3 వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో దుబ్బాకకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు మొత్తం రెండు స్వర్ణ, ఆరు రజత, మూడు కాంస్య పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. లచ్చపేట ఆదర్శ పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ కట విభాగంలో స్వర్ణ, కుమిటే విభాగంలో రజత పతకం సాధించాడు. సరస్వతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన రిశ్విత స్వర్ణ పతకం, శిల్పిత రజత పతకం గెలుచుకున్నారు. మాస్టర్ మైండ్ స్కూల్‌కు చెందిన రిషి అఖిల్, సర్వజ్ఞ రజత పతకాలు, ప్రణవి, సాత్విక్ కాంస్య పతకాలు సాధించారు. గాయత్రి వివేకానంద విద్యాలయానికి చెందిన మనస్విన్ కట విభాగంలో రజత, కుమిటే విభాగంలో కాంస్య పతకం సాధించగా, దిశా స్కూల్‌కు చెందిన ఆరావ్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. విజేతలను ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు బుచ్చిబాబు, వెంకట్ రెడ్డి, హరిబాబు, కమలాకర్, భాస్కర్ రెడ్డి, యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, రేంజుకి షోతోకన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా వ్యవస్థాపకులు మాస్టర్ నగేష్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, షైనరాయి షోతోకన్ కరాటే అకాడమీ ఫౌండర్ సురేందర్ సుబ్బు, కిక్కర్స్ ఫౌండర్ నాగరాజు, షీ టీం లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు అభినందించారు.




# హాట్ టాపిక్‌గా హైడ్రా కమిషనర్

- విధులకు హాజరు ఏవీ రంగనాథ్
- కమిషనర్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశాలు
- ప్రజావాణి నిర్వహణ, పిర్యాధుల స్వీకరణ
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన



హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

హైడ్రా కమిషనర్ టాఫిక్ హాట్ హాట్ గా మారింది.కొద్ది రోజులుగా సెలవుల్లో ఉన్న ఆయన గడువు ముగిసిన వెంటలే తిరిగి విధులకు హాజరయ్యారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తిరిగి కార్యాలయానికి చేరుకుని విధుల్లో చేరడంతో పరిణామాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. కమిషనర్‌ను మార్చాలంటూ ఒకవైపు హైకోర్టు ఆదేశాలతో మార్పు తప్పదని ఊహించారు.కానీవారి అంచనాలు తలకిందులు చేస్తూ.. ఆయన విధుల్లో పాల్గొని నేరుగా ప్రజావాణి కార్యక్రమాన్నినిర్వహించారు. ప్రజల నుండి పిర్యాధులను స్వీకరించారు.మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఆయనను మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేయడంతో ఏవీ రంగనాథ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రజావాణిలో కొద్దిమంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, స్వయంగా ఆయనే ఆయా ప్రాంతాలను నేరుగా పరిశీలించారు. బాధితుల సమస్యలను ఓపికగా ఆలకించిన ఆయన, నిబంధనల ప్రకారం తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# సరూర్ నగర్ లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ

## ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలన-టీఆర్ఎస్ నేతలు

## సభకు తరలి రావాలని ప్రజలకు పిలుపు..



హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో చేపట్టిన సభ ఏర్పాట్లను పార్టీ నాయకులు పరిశీలించారు.

ఈనెల 6వ తేదీన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను తలపెట్టినట్లు కొద్దిరోజుల క్రితం టీఆర్ఎస్ అధినేత్రి కవిత స్పష్టం చేశారు.సామాజిక న్యాయ తెలంగాణ సాధన దిశగా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణ పై పూర్తి వివరాలను ఆమె వెల్లడించనున్నారు.

కవితమ్మతోనే సబ్బండ వర్గాలకు న్యాయం..

సబ్బండ వర్గాలకు కల్వకుంట్ల కవితతోనే పూర్తి న్యాయం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన నాయకులు స్పష్టం చేశారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం టీఆర్ఎస్ నాయకులు నరేశ్ ప్రజాపతి, కోల శ్రీనివాస్, ఎత్తరి మారయ్య మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అన్ని వర్గాలకు రాజకీయాల్లో సముచిత స్థానం దక్కాలనే దృఢ సంకల్పంతో టీఆర్ఎస్ చీఫ్ కవిత పనిచేస్తున్నారని స్పష్టం చేశారు.సబ్బండ వర్గాలకు సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా ఆమె పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. శాసనసభ,శాసనమండలి వైపు చూడని ఎన్నో వెనుకబడిన కులాల ఆకాంక్షలను, సమస్యలను శాసనమండలి వేదికగా కవిత ప్రస్తావించారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శిగా టెంకంపేట్ నర్సింలు.



దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 03.

సిద్దిపేట జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కార్యదర్శిగా రాయపోల్ మండల పరిధిలోని ఉదయపూర్ గ్రామానికి చెందిన టెంకంపేట్ నర్సింలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని నర్సింలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సింగిల్ యూస్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: మున్సిపల్ చైర్ పర్సన్:గంగిశెట్టి చందన రవీందర్

గజ్వేల్:03 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో, సెంట్ మేరీస్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన "సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ అవగాహన




కార్యక్రమం" సోమవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరగడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకానికి ప్రజలందరూ పూర్తిగా స్వస్తి పలికి, మార్కెట్‌కు వెళ్లే సమయంలో ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులు, జూట్ బ్యాగులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ రాయబారులుగా మారి తమ ఇళ్లలో,పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణం ఏర్పడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి,నీరు,వాయు కాలుష్యం ఎలా ఏర్పడుతుందో విద్యార్థులు,ఉపాధ్యాయులకు వివరించారు.పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత మోడల్ మున్సిపాలిటీగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు పురపాలక సంఘానికి సహకరించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు,సెంట్ మేరీస్ స్కూల్ యాజమాన్యం,ఉపాధ్యాయులు,విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ రామచంద్రంకు సన్మానం

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 03:

భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ రామచంద్రం వరుసగా రెండోసారి నియమితులైన సందర్భంగా ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, గజ్వేల్ మండల అధ్యక్షుడు మనోహర్ యాదవ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్నె శేఖర్, మహిపాల్ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 25వ వార్షికోత్సవం సందర్భంగా 25 వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించిన ఐసీఐసీఐ లాంబార్డ్!

## - ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, వినియోగదారులకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చే 25 వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించింది

## - ఆరోగ్య, మోటార్, గృహ, ప్రయాణ, వాణిజ్య బీమా విభాగాల్లో కొత్త ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది.




ముంబై, ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ తన రజతోత్సవ వేడుకల సందర్భంగా, వివిధ వ్యాపార విభాగాలకు చెందిన 25 వినూత్న పరిష్కారాలను నేడు ఆవిష్కరించింది. గతంలో ఒకే రోజున 14 కొత్త ఉత్పత్తులు/పరిష్కారాలను ప్రారంభించిన తన రికార్డును అధిగమిస్తూ, ఈసారి ఒకే రోజులో 25 వినూత్న పరిష్కారాలను విడుదల చేసింది. వీటిలో ఇన్సూరెన్స్ రంగంలో తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఐదు వినూత్న పరిష్కారాలు కూడా ఉన్నాయి. ఈ పరిష్కారాలు వినియోగదారులకే ప్రథమ ప్రాధాన్యం అనే సంస్థ సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అలాగే, కృత్రిమ మేధ వంటి నూతన తరం సాంకేతికతల శక్తిని ఇన్సూరెన్స్ సేవల మొత్తం జీవితచక్రం అంతటా వినియోగదారుల-కేంద్రిత దృక్పథంతో సమన్వయం చేస్తూ రూపొందించబడ్డాయి.

గత 25 సంవత్సరాలుగా, ఐసీఐసీఐ లాంబార్డ్ వినియోగదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా నిరంతరం అభివృద్ధి చెందుతూ, బీమా సేవల పాత్రను కేవలం ఆర్థిక రక్షణకే పరిమితం కాకుండా మరింత విస్తరించింది. ఇప్పటివరకు 50 కోట్లకు పైగా వినియోగదారులకు సేవలందించిలి, 6 కోట్లకు పైగా క్లెయిమ్‌లను పరిష్కరించినలి ఈ సంస్థ, ఇప్పుడు తదుపరి దశకు రూపకల్పన చేస్తోంది. ఇందుకోసం, వినియోగదారులు ప్రమాదాలు సంభవించిన తర్వాత వాటి నుంచి కోలుకోవడమే కాకుండా, వాటిని ముందుగానే అంచనా వేసి సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు తోడ్పడే వినూత్న పరిష్కారాలను అందిస్తోంది.

ఈ సందర్భంగా ఐసీఐసీఐ లాంబార్డ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంజీవ్ మంత్రీ మాట్లాడుతూ,"గత 25 సంవత్సరాలుగా, ఐసీఐసీఐ లాంబార్డ్ మూల స్ఫూర్తి ఎంతో సరళమైనది --- మేము వినియోగదారులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడం, అలాగే రేపటి ప్రతి అవసరానికి అనుగుణంగా నిరంతరం నవకల్పనలు చేయడం, " అని అన్నారు, ఆయన ఇంకా మాట్లాడుతూ,"మా రజతోత్సవం అనే ఈ చారిత్రక సందర్భంగా, మాపై విశ్వాసం ఉంచి, నిరంతరం మద్దతు అందిస్తున్న వినియోగదారులు, భాగస్వాములు, ఉద్యోగులు, వాటాదారులు, నియంత్రణ సంస్థలతో సహా మా మొత్తం భాగస్వామ్య వ్యవస్థ పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ మైలురాయి సందర్భంగా, మా వినియోగదారులకు ఇచ్చిన హామీలను మరోసారి పునరుద్ఘాటించాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే మా రజతోత్సవ వేడుకల సందర్భంగా 25 వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించాం. ఈ కొత్త పరిష్కారాలు మా వినియోగదారుల విభిన్న అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చడంలో తోడ్పడటమే కాకుండా, బీమా సేవలను మరింత వ్యక్తిగతీకరించినవి), మరింత అర్థవంతమైనవి), భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు.

25 వినూత్న పరిష్కారాల ప్రధాన విశేషాలు ఇవి:

తదుపరి తరం ఉత్పత్తులు

ఎలివేట్ హర్: మహిళల జీవితంలోని వివిధ దశల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన మాడ్యులర్ ఉమెన్ కేర్ బీమా ఉత్పత్తి. ఇందులో ఓపీడీ, వెల్‌నెస్ సేవలు, మాతృత్వ సంరక్షణ, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, మహిళలకు సంబంధించిన క్యాన్సర్‌లపై ఆర్థిక రక్షణ వంటి సేవలను ఒకే సమగ్ర పరిష్కారంగా అందిస్తున్నారు. ఇన్సూరెన్స్ రంగంలో తొలిసారిగా, మహిళలు జీవితంలోని వివిధ దశల్లో ఎదుర్కొనే మారుతున్న అవసరాలకు అనుగుణంగా నాలుగు వ్యక్తిగతీకరించిన బీమా ప్లాన్‌లను ఈ ఉత్పత్తి అందిస్తోంది. ఒక దశ నుంచి మరో దశకు మారుతున్నప్పుడు కూడా, వారి అవసరాలకు అనుగుణంగా అంతరాయం లేకుండా బీమా రక్షణను కొనసాగించేలా ఈ పరిష్కారాన్ని రూపొందించారు. పా కేర్: వినియోగదారుల పెంపుడు జంతువులకు సమగ్ర బీమా రక్షణ అందించే ప్రత్యేక పెట్ ఇన్సూరెన్స్ ప్లాన్. ఇందులో పశువైద్య ఖర్చులు, అత్యవసర చికిత్స, అనారోగ్యాలు, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అలాగే పెంపుడు జంతువుల సాధారణ ఆరోగ్య సంరక్షణ వంటి సేవలకు బీమా రక్షణ లభిస్తుంది. ఈ పథకంలో దీర్ఘకాలిక బీమా కవరేజీ, అలాగే రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ట్యాగ్ ఆధారంగా ప్రీమియంపై ప్రత్యేక రాయితీలు వంటి పరిశ్రమలోనే ముందంజలో నిలిచే ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయి.

కంప్లీట్ హోమ్ ప్రొటెక్ట్: సాధారణ గృహాల నుంచి అత్యాధునిక విలాసవంతమైన నివాసాల వరకు అన్ని రకాల గృహ యజమానుల కోసం రూపొందించిన మాడ్యులర్, సమగ్ర జీవనశైలి రక్షణ బీమా పరిష్కారం. ఈ బీమా పథకం ద్వారా ఇంటి ఇంటీరియర్లు, నగలు, కళాఖండాలు, విలువైన సేకరణలు, ఫర్నిచర్, గృహోపకరణాలు వంటి ఆస్తులకు రక్షణ లభిస్తుంది. అలాగే, ఇన్సూరెన్స్ రంగంలో తొలిసారిగా బహుళ క్యాష్‌లెస్ హోమ్ అసిస్టెన్స్ సేవలు మరియు గరిష్ఠంగా 30 సంవత్సరాల వరకు పాలసీ కాలపరిమితి ఎంపికలను అందిస్తోంది. అదనంగా, దీర్ఘకాలిక పాలసీలకు ప్రతి సంవత్సరం నిర్ణీత స్థాయిలో బీమా మూలధన విలువ పెరిగే సౌకర్యాన్ని కల్పించింది. అంతేకాక, ఇల్లు నివాసయోగ్యం కాని పరిస్థితి ఏర్పడితే తాత్కాలిక నివాసానికి అయ్యే అదనపు జీవన వ్యయాలను కూడా కవర్ చేస్తుంది. ఈ విధంగా, మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సమగ్ర రక్షణను అందించేలా ఈ ఉత్పత్తిని రూపొందించారు.

**సేవల అనుభవానికి మరింత ఉన్నత స్థాయి**

సిద్ధివినాయక్‌లో డిజిటల్ బ్రాంచ్ (పరిశ్రమలోనే తొలిసారి): మెట్రో రవాణా వాతావరణంలో భారతదేశపు మొట్టమొదటి డిజిటల్ బీమా శాఖ. ఇది ఆరోగ్య, మోటార్ మరియు ప్రయాణ బీమా కోసం స్వీయ-సేవ మరియు సహాయక సేవలను మిళితం చేస్తుంది. ఇది పాలసీ కొనుగోలు, పునరుద్ధరణలు, క్లెయిమ్‌ల నమోదు మరియు ట్రాకింగ్, ఆన్‌లైన్ కేవైసీ, పత్రాల సమర్పణ మరియు డిజిటల్ సేవలను సులభతరం చేస్తుంది. ఈ శాఖ నేటి వినియోగదారులు ఆశించే సేవలకు అంటే, తక్షణ, నిరాటంకమైన మరియు ప్రయాణంలోనే లభించే సేవలకు కూడా అనుగుణంగా ఉంటుంది.

మోటార్ సర్వీస్ అష్యూర్ (పరిశ్రమలోనే తొలిసారి): ఇది సమయానికి సేవలు అందించే ఒక రోడ్‌సైడ్ సహాయ సేవ. వాహనాలు పాడైనప్పుడు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు ఇది బ్యాటరీ ఛార్జింగ్ సహాయం, వాహనాన్ని టోయింగ్ చేయడం మరియు సంఘటనా స్థలంలోనే చిన్నపాటి మరమ్మతులను అందిస్తుంది. ఇది భారతదేశంలోని 15 నగరాల్లో, 24ఇ7, 30 నిమిషాల సర్వీస్ హామీని అందిస్తుంది. ఈ ప్రతిపాదన సేవా స్థిరత్వాన్ని బలపరుస్తుంది, అధిక ఒత్తిడి పరిస్థితులలో వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరుస్తుంది మరియు ఊహించదగిన, సమయబద్ధమైన, ఉన్నతమైన సహాయం అందించాలనే ఐసిఐసిఐ లోంబార్డ్ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

మోటార్ సహాయక్: ప్రైవేట్ కార్ కస్టమర్ల కోసం ఒక ప్రీమియం సర్వీస్ ఆఫరింగ్. ఇది వాహన సంబంధిత అత్యవసర పరిస్థితులలో తక్షణ సహాయాన్ని అందిస్తుంది. ఇది అత్యవసర సహాయం, చట్టపరమైన మరియు విధానపరమైన సౌలభ్యం, రక్షణ సంబంధిత ఖర్చుల రీయింబర్స్‌మెంట్, మరియు వాహన డాక్యుమెంటేషన్ సహాయాన్ని ఏకీకృతం చేసి, కస్టమర్లకు పూర్తి మనశ్శాంతిని అందిస్తుంది.

ప్రత్యేక సర్వీస్ డెస్క్: ఐసిఐసిఐ లోంబార్డ్ యొక్క యూనిఫైడ్ సర్వీస్ ఆఫరింగ్ ఇప్పుడు ప్రత్యేక సర్వీస్ డెస్క్‌లతో వ్యక్తిగతీకరించబడింది. సీనియర్ సిటిజన్లు మరియు ఇతర ప్రాధాన్యత కలిగిన కస్టమర్ గ్రూపులకు వేగవంతమైన మరియు అవాంతరాలు లేని సర్వీస్ అనుభవం కోసం, ప్రాధాన్యత యాక్సెస్ మరియు వ్యక్తిగతీకరించిన సహాయాన్ని అందించడానికి ఇవి రూపొందించబడ్డాయి.

**ఏఐ ఆధారిత వినూత్న పరిష్కారాలు**

వాయిస్ ఏఐ (పరిశ్రమలోనే తొలిసారి): వాయిస్ ఏఐ ఆధారిత కస్టమర్ ఎనేబుల్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ అనేది సహజమైన, మనుషులతో మాట్లాడినట్లే అనిపించే సంభాషణల ద్వారా వినియోగదారులకు సేవలు అందించే అత్యాధునిక సంభాషణాత్మక పరిష్కారం. ఇది బీమా ప్రయాణం మొత్తంలో వినియోగదారులకు తోడ్పడుతుంది. ఇందులో, పాలసీకి సంబంధించిన సందేహాలకు సమాధానాలు ఇవ్వడం, పాలసీలో మార్పులు చేయడం, పాలసీ కొనుగోలు ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు సులభంగా పూర్తి చేయించడం, చెల్లింపులను పూర్తి చేయడంలో సహాయపడడం వంటి సేవలు ఉంటాయి. ఈ ప్లాట్‌ఫారమ్ హిందీ, ఇంగ్లీష్ భాషల్లో వినియోగదారులతో సంభాషించగలదు. ఇది 24 గంటలు, వారంలో ఏడు రోజులు (24ఇ7) అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా, వినియోగదారులు తమకు అనుకూలమైన సమయంలో కాల్‌బ్యాక్ కోరే సౌకర్యాన్ని కూడా కల్పిస్తుంది. దీంతో వారికి మరింత సౌకర్యవంతమైన, వేగవంతమైన మరియు వ్యక్తిగతీకరించిన బీమా సేవల అనుభవం లభిస్తుంది.

ఈ వాయిస్ బాట్‌కు సేల్స్ ఏజెంట్‌గా కూడా పనిచేసేలా శిక్షణ ఇచ్చారు. దీంతో వినియోగదారుడు ఫోన్ కాల్‌లోనే బీమా ప్రతిపాదన నుంచి చెల్లింపు పూర్తయ్యే వరకు మొత్తం ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఈ వాయిస్ ఏఐ ఏజెంట్ ద్వారా 10 లక్షలకు పైగా కాల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ సంఖ్య రోజురోజుకూ మరింత పెరుగుతోంది.

వ్యక్తిగతీకరించిన ట్రావెల్ ప్లానర్ (ఇండస్ట్రీలోనే తొలిసారి): ఐఎల్ టేక్‌కేర్ యాప్‌లో అందుబాటులో ఉన్న ఈ ఏఐ ఆధారిత సంభాషణాత్మక ట్రిప్ ప్లానర్ ప్రయాణ ప్రణాళికను మరింత సులభతరం చేస్తుంది. వినియోగదారులు తాము వెళ్లాలనుకునే గమ్యస్థానం, ప్రయాణ తేదీలు, బడ్జెట్, అలాగే తమ వ్యక్తిగత అభిరుచులను నమోదు చేస్తే, ఈ ఏఐ సాధనం వెంటనే రోజువారీ ప్రయాణ ప్రణాళికను రూపొందిస్తుంది. ఈ ప్రణాళికను అవసరానికి అనుగుణంగా నిజ సమయంలోనే సవరించుకునే అవకాశం కూడా ఉంటుంది. అంతేకాకుండా, ఇందులో అంతర్నిర్మిత ట్రావెల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. ప్రయాణికులు తమ బహుళ-రోజుల ప్రయాణ ప్రణాళికను సులభంగా పరిశీలించవచ్చు, మ్యాప్‌లలో ప్రయాణ మార్గాలను చూడవచ్చు, అలాగే ప్రయాణానికి సంబంధించిన సమయానుకూల సూచనలు పొందవచ్చు. దీంతో ప్రయాణ ప్రణాళిక మరింత సులభంగా, సహజంగా మారుతుంది. ముఖ్యంగా, ప్రయాణ ప్రణాళిక రూపొందించుకునే ప్రక్రియలోనే ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను కూడా కొనుగోలు చేసి పూర్తి చేసుకునే సౌకర్యాన్ని ఈ సేవ కల్పిస్తుంది.

స్మార్ట్ హెల్త్ అండర్‌రైటింగ్ (పరిశ్రమలోనే తొలిసారి): ఏఐ ఆధారిత హెల్త్ ఇన్సూరెన్స్ అండర్‌రైటింగ్ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు వేగవంతమైన, సులభమైన, సహజమైన పూర్తి స్థాయి బీమా అనుభవాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా, వారికి అనుకూలమైన సమయంలో అందించేలా రూపొందించారు. ఈ పరిష్కారంలో స్వీయ-మార్గనిర్దేశిత డిజిటల్ ప్రక్రియ ఉంటుంది. ఇందులో వినియోగదారులకు వారి వివరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన ప్రశ్నలు అడుగుతారు. ఆ సమాధానాలను ఏఐ నిజ సమయంలోనే విశ్లేషించి, అండర్‌రైటింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా, స్థిరమైన మరియు ఖచ్చితమైన నిర్ణయాలను తీసుకుంటుంది. దీని వల్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ మంజూరు ప్రక్రియ మరింత వేగంగా, పారదర్శకంగా, వినియోగదారులకు సౌకర్యవంతంగా పూర్తవుతుంది.

ఐసీఐసీఐ లాంబార్డ్ తన తదుపరి ప్రస్థానంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంగా, గత 25 సంవత్సరాలుగా నిలబెట్టుకున్న ఒకే ఒక్క వాగ్దానాన్ని వినియోగదారులు ఎక్కడ ఉన్నా, వారు అత్యంత విలువైనదిగా భావించే ప్రతి అంశానికి అండగా నిలిచి, సమగ్ర రక్షణను అందించడం లాంటి ఈ వినూత్న పరిష్కారాల ద్వారా మరోసారి పునరుద్ఘాటిస్తోంది.




## బొమ్మలరామారం మండల ఇన్చార్జి తహసిల్దార్ గా ఎస్. సునీల్ కుమార్

బొమ్మలరామారం ఆగస్టు 3 (ప్రజా కలం)



యాదాద్రి భువనగిరి జిల్లా,బొమ్మలరామారం మండలంలో తాహసిల్దారుగా పనిచేసిన పి.శ్రీనివాసరావు జులై 31న పదవి విరమణ చేయడంతో గత ఆరు రోజులుగా జిల్లా యంత్రాంగం నూతన బొమ్మలరామారం మండలం లో నూతన తాహ సిల్దారును నియమించకపోవడంతో తహసిల్దార్ కార్యాలయంలో ఏలాంటి రిజిస్ట్రేషన్లు, ఇతర కార్యక్రమాలకు ఇబ్బంది కలగడంతో జిల్లా కలెక్టర్ కు వచ్చిన ఫిర్యాదు పై స్పందించిన కలెక్టర్ బొమ్మలరామారం మండలంలో డిప్యూటీ తాహసిల్దార్ గా పనిచేస్తున్న పి.సునీల్ కుమార్ ను ఇన్చార్జ్ తాసిల్దారుగా నియమిస్తూ ప్రొసిండిగ్ నెంబర్ : A1/2573/2026 ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇన్చార్జి తాహసిల్దారుగా ఉంటారని వెల్లడించారు

## తాండల్లో జోనల్ కమిషనర్ పర్యటన



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) దుందిగల్ తండాల్లో కుత్బుల్లాపూర్ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ పర్యటించారు. తండాలోని రోడ్లు లింక్ రోడ్డు పరిశీలించారు. పగిలిన రోడ్లు గుంతల పడ్డ వాటిని వెంటనే మంజూరు చేస్తామన్నారు. దుందిగల్ సర్కిల్ డిసితో కలిసి బస్తీ రోడ్లు పరిశీలించిన జోనల్ కమిషనర్ వెంటనే ఎస్టిమేట్ వేసి రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తాండలలోని ప్రధాన సమస్యలను జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రేవ్ యార్డ్ లో రోడ్డు, వాటర్ బోర్, వెయిటింగ్ హాల్, స్నానల గదులు లాంటి సౌకర్యాలు కల్పించాలని, డ్రైనేజీ నీరు అవుట్ లెట్ శాశ్వత పరిష్కారం చూపించాలని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే హెచ్ఎంటి మీదుగా తాండ1 సర్వీస్ రోడ్ వరకు లింక్ రోడ్డు సాంక్షన్ చేయాలని తండాలో డ్రైనేజీ పూర్తి అయి సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్తి రోడ్లు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ కి కోరారు. అందుకు స్పందించిన కమిషనర్ సమస్యలు ఉన్న రోడ్లను సమస్యత్మక పనులను వెంటనే సాంక్షన్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజలు నాయకులు అధికారులు హెచ్ఎంటి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## దుండిగల్ గ్రామంలో రూ.70 లక్షల CMC నిధులతో UGD పనులకు శంకుస్థాపన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గ్రామం, 296వ డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా, ఆయన ప్రత్యేక చొరవతో జవీజ నిధుల నుంచి రూ.70 లక్షలు మంజూరయ్యాయి.



ఈనిధులతో దుండిగల్ గ్రామంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (UGD) అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు దుండిగల్ గ్రామం, 296వ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, కావలి శశికుమార్, ఆకుల మధు, చిన్న ముత్యం రెడ్డి, బిక్షపతి రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి:

## అదనపు కలెక్టర్ భుజంగరావు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 3:

ప్రజావాణి కార్యక్రమానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని నిజామాబాద్ అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులు తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. ఈ సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. బాధితులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ



అధికారి (డీఆర్ఓ) గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్నలకు స్వయంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఏమాత్రం పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన పూర్తి వివరాలను, సహేతుక వివరణలతో వెంటవెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ముమ్మర చర్యలు:

## ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి దామోదర్ రాజానర్సింహా, షబ్బీర్ అలీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 03:

నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లాకు చెందిన శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు),



మరియు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న వివిధ సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత, వైద్య సేవల విస్తరణ మరియు అవసరమైన డాక్టర్లు, సిబ్బంది నియామకం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలను మరింత చెంతకు చేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. హాజరైన ప్రజాప్రతినిధులు ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాదు రూరల్ ఎమ్మెల్యే భూపాతిరెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మరియు నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొని తమ నియోజకవర్గాల్లోని ఆసుపత్రుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# బీరంగూడలో క్రికెట్ సందడి..

## చదువు, క్రీడలతోనే భావి భారత నిర్మాణం..ఐలాపూర్ మాణిక్ యాదవ్..

పటాన్‌చెరు,ఆగస్టు 3 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్పూర్ మున్సిపాలిటీ బీరంగూడ డివిజన్‌లో విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, విద్యపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ,నాణ్యమైన విద్యతోనే ఉత్తమ పౌరులు తయారవుతారని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రతి చిన్నారికి విద్య హక్కును కల్పించిందని గుర్తు చేశారు. విద్య వ్యక్తిగత జీవితాన్నే కాకుండా దేశ అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరమని తెలిపారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు..



## కేకేవై జాతీయ రహదారికి

# తక్షణ ఆమోదం ఇవ్వండి

## - కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కోరిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే





కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 ప్రజా కలం : కరీంనగర్--సిరిసిల్ల--వేములవాడ--కామారెడ్డి--ఎల్లారెడ్డి--పిట్లం వరకు ఉన్న సుమారు 165 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని కోరారు. సోమవారం ఎమ్మెల్యే ఢిల్లీ లో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల తెలంగాణ ఉత్తర, పశ్చిమ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు లభించడంతో పాటు మహారాష్ట్రతో అనుసంధానం మరింత బలపడుతుందని వివరించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా కేకేవై రహదారి అంశం ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. అలాగే జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ కు, కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి ఎమ్మెల్యే సైతం వినతి పత్రం అందచేశారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా పరిశీలనలు పూర్తయ్యాయని, తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసిందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం ప్రతిపాదన ఎదురుచూస్తోందని తెలిపారు. ప్రతిపాదిత జాతీయ రహదారి ఎన్‌హెచ్--563 (కరీంనగర్), ఎన్‌హెచ్--44 (కామారెడ్డి), ఎన్‌హెచ్--765డీ (ఎల్లారెడ్డి), ఎన్‌హెచ్--161 (పిట్లం)లను అనుసంధానించే కీలక కారిడార్‌గా మారుతుందని తెలిపారు. ఈ మార్గం ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరుకు రవాణా, వ్యవసాయం, వాణిజ్యం, పారిశ్రామిక రంగాలు, పర్యాటకంతో పాటు వేములవాడ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు చేరుకోవడం మరింత సులభమవుతుందని పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనకు ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నుంచి సూత్రప్రాయ ఆమోదం లభించిందని, అనంతరం అవసరమైన సాంకేతిక నివేదికలు, గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్, ఇతర వివరాలు సమర్పించామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం 2022లో, రాష్ట్ర రోడ్లు--భవనాల శాఖ మంత్రి 2024లో కూడా ఈ రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయాన్ని వినతిపత్రంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనకు తక్షణ ఆమోదం తెలిపి కరీంనగర్--పిట్లం 165 కిలోమీటర్ల జాతీయ రహదారిని మంజూరు చేసి, పరిపాలన, ఆర్థిక అనుమతులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.




# నిజామాబాద్ 'ప్రజావాణి'లో 30 ఫిర్యాదులు

## త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సాయి చైతన్య ఆదేశం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 03:

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి 30 ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ (సీపీ) పి. సాయి చైతన్య, ఐపీఎస్ స్వయంగా స్వీకరించారు. కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఆయన కూలంకషంగా విన్నారు. అనంతరం వాటిని చట్ట ప్రకారం, అత్యంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల వినతిపత్రాలను సీపీ పరిశీలించారు. అక్కడికక్కడే సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడి కేసుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మధ్యవర్తులను నమ్మొద్దు సీపీఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి మధ్యవర్తులను గానీ, పైరవీకారులను గానీ ఆశ్రయించవద్దని కోరారు. బాధితులు నేరుగా పోలీస్ శాఖను సంప్రదించి తమ ఫిర్యాదులను అందజేయవచ్చని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టబద్ధంగా ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ వారపు ప్రజావాణిలో మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు సీపీ వెల్లడించారు.

# పండుగ వాతావరణంలో పంద్రాగస్టు వేడుకలు: అదనపు కలెక్టర్ వి.భుజంగరావు



నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి)ఆగస్టు 03 :

నిజామాబాద్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని అన్నారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు. సన్నాహక సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జెడ్పి సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,.డీఆర్డీఓ సాయన్న, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పేరుకే ప్రజావాణి, ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం?



యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 3 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన చర్యలు తీసుకోవడంలో మండల, జిల్లా అధికారులు విఫలమవుతున్నారని ఫిర్యాదారులు వాపోతున్నారు సమస్యలపై సోమవారం రోజున నిర్వహించే ప్రజావాణిలో యాదాద్రి భువనగిరి జిల్లా నుండి 17 మండలాల నుండి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుంది ఇచ్చిన ఫిర్యాదులపై జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు మండలాధికారులకు ఆదేశాలు జారీ చేసిన పరిష్కారానికి నోచుకోవడం లేదు సోమవారం రోజున ప్రజావాణిలో వచ్చిన 113 ఫిర్యాదుల్లో 65 రెవెన్యూ సంబంధించిన ఫిర్యాదులు రావడం దీనికి ఉదాహరణ. గత నెల 27వ తేదీన ప్రజావాణిలో వచ్చిన 134 ఫిర్యాదుల్లో 64 రెవిన్యూ సంబంధించిన ఫిర్యాదులు, 20వ తేదీన వచ్చిన 92 ఫిర్యాదుల్లో 56 రెవెన్యూ సంబంధించిన ఫిర్యాదులు,13వ తేదీన ప్రజావాణిలో వచ్చిన 113 ఫిర్యాదుల్లో 56 రెవెన్యూ ఫిర్యాదులు,06వ తేదీన ప్రజావాణిలో వచ్చిన 71 ఫిర్యాదుల్లో 45 రెవిన్యూ సంబంధించిన అర్జీలు రావడం అధికారుల పనితీరు ఎలా ఉందో దీనికి నిదర్శనం. జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్న ఆదేశాలను అధికారులు పాటించకుండా కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి ప్రజావాణిలో రెవెన్యూ తో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల పైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు

# ముంబైలో రాజ్యాంగ ప్రతుల విక్రయం పెరిగింది

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి( ఆగస్టు 03:

మరి ముఖ్యంగా జెన్– జీ ఉద్యమం వల్ల మహారాష్ట్ర వ్యాప్తంగా భారత రాజ్యాంగ గ్రంథం కొనుగోలు విపరీతంగా పెరిగింది. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి అంబేద్కర్ సాహిత్యానికి ఉన్న డిమాండ్ పెరిగిందని వివిధ ప్రచురణ సంస్థలు, స్టాల్ సెల్లార్స్ తెలిపారు. విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నందున ప్రతినెల 26తేదీన రాజ్యాంగ పఠనం చేస్తున్నారు. ఈ కారణంగా రాజ్యాంగంపై రాసిన పుస్తకాలకు కూడా డిమాండ్ పెరిగింది. దేశ పౌరులకు బాబాసాహెబ్ కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సోదరభావం అనే మానవీయ ఆలోచనలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడం అవసరముందని దాదార్లోని చైత్యభూమి వద్దగల బుక్ స్టాల్ యజమాని అనిల్ పాండురంగ ఖైరే గురూజీ అన్నారు. బాబాసాహెబ్ కోట్ల సామాన్య ప్రజల్లో సామాజిక సాంస్కృతిక రాజకీయ మార్పుకు నాంది పలికారు. ఇలాంటివి ఏ ధర్మ గ్రంథాల్లో కనిపించవు, ప్రజలు ఆస్వాదించలేరు. ఐతే పాకెట్ ఎడిషన్ల (చిన్న సైజ్ రాజ్యాంగాన్ని) రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినందున విద్యార్థులు, సాధారణులు దీన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని ప్రచురణకర్తలు తెలిపారు. మరోవైపు మేఘన మాఘవి రచయిత్రి “మన హక్కుల గురించి ప్రతి భారతీయ పౌరుడికి తెలియడం అవసరం. అందుకే రాష్ట్రంలోని ప్రతి “ఇంట్లో ఒక చిన్న రాజ్యాంగ పుస్తకం” ఉండాలి. అది చిన్నదైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంద” న్నారు. ప్రస్తుతం హిందీ మరాఠీ ఇంగ్లీష్ భాషలోని ప్రతులు 20% కొనుగోలు పెరిగాయి. ఇది సంతోషించదగిన పరిణామం. వాస్తవానికి రాజ్యాంగం జెన్– జీ ఉద్యమానికి “ఉద్యమ టార్చ్” అంటూ ఆయన అభివర్ణించారు.





## మల్కాజిగిరిలో బోనాల చెక్కుల పంపిణీ

మల్కాజిగిరి,ఆగస్టు03,(ప్రజా కలం ప్రతినిధి)

అమ్మవారి కృపా కటాక్షాలతో మల్కాజిగిరి ప్రాంత ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు.నియోజకవర్గం అమ్మవారి బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరి వాణి నగర్ విజయ గణపతి ఆలయంలో జరిగింది ఈ కార్యక్రమానికి అతిధులుగా బీర్లా ఐలయ్య స్థానిక శాసనసభ్యులు రాజశేఖర్ రెడ్డి లు హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలో 230 ఆలయాలకు 76 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.గత ప్రభుత్వం కంటే కూడా రెండు సంవత్సరాలలో బోనాల పండుగ ఘనంగా జరుపుకోవాలని నిధులను అధికంగా కేటాయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న రోజులలో నియోజకవర్గ అభివృద్ధి అంశాల పైన సమావేశాన్ని నిర్వహించుకుందామని స్పష్టం చేశారు. ఇంతకన్నా ముందు బీర్ల ఐలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.గత సంవత్సరం బోనాల చెక్కుల పంపిణీలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకొని స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్,ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారులు వెంకన్న, శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఎండోమెంట్ అధికారులు,మాజీ కార్పొరేటర్ లు,ఆలయ కమిటీ చైర్మన్ లు,మాజీ చైర్మన్ వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో ప్రజా సమస్యలను పరిష్కరించండి

### మల్కాజిగిరి బిజెపి నాయకులు

మల్కాజిగిరి,ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను వారి కార్యాలయంలో మల్కాజిగిరి నియోజకవర్గ బిజెపి నాయకులు కలసి మెమోరండాన్ని అందజేశారు.ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రాంతంలో ప్రజలు రోడ్లు మరమ్మత్తు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు మరమత్తు పనులను చేపట్టాలన్నారు మిర్జాల్ గూడా చిన్మయి మార్గ్ నీటిముంపు సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళికతో పనులను త్వరితగతిన చేయాలని కోరినట్లు చెప్పారు. సఫిల్గుడా, బండ చెరువు లలో గుర్రపు డెక్క పెరిగి విపరీతమైన దోమలతో ప్రజలు సతమతమవుతున్నారని గుర్రపు డెక్కన్ తొలగించి దోమలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు.గౌతమ్ నగర్ డివిజన్ ఐ ఎన్ నగర్ లో నీటి సమస్య ఉందని నీటి సరఫరా విషయంలో చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్ ముదిరాజ్ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు,సునీత యాదవ్ మాజీ కార్పొరేటర్,ప్రసణ,జీడి బాలచందర్ గౌడ్,ఉడుత నవీన్,నాగరాజు, ధనలక్ష్మి,అంజలి,సోమా శ్రీనివాస్,భరత్ యాదవ్ తేజ,గణ,ప్రకాష్,మనోజ్, చందు,కిరణ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ భరోసా..

**తెలంగాణ అమరుడు యాదిరెడ్డి కుటుంబానికి అండగా కేటీఆర్**

**నందినగర్ లో కేటీఆర్ ను కలిసిన కుటుంబ సభ్యులు**

**యాదిరెడ్డి తమ్ముడి కుమార్తె భవిష్యకు వైద్యచికిత్స..**

**భవిష్యతో ముచ్చటించిన కేటీఆర్..**

హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ఉద్యమ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు.యాదిరెడ్డి తమ్ముడి కుమార్తె భవిష్యకు వైద్య చికిత్సకు కావల్సిన సాయం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయవంతంగా మైనర్ శస్త్రచికిత్స పూర్తి కావడంతో,కోలుకున్న చిన్నారి భవిష్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు సోమవారం నంది నగర్ లోని కేటీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి భవిష్యతో కేటీఆర్ ఆప్యాయంగా ముచ్చటిస్తూ ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.చిన్నారి త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో ఎదగాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో చదువుల్లోభాగా రాణించి,ఉన్నత స్థాయికి ఎదగాలని దీవించారు..గత నెల మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామంలో అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంగా, యాదిరెడ్డి తమ్ముడి కుమార్తె భవిష్య ఆరోగ్య సమస్య గురించి కేటీఆర్ తెలుసుకున్నారు. ఆమెకు మైనర్ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించిన విషయం తెలిసిన వెంటనే ఆందోళన చెందవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరపున మెరుగైన వైద్య చికిత్స అందించేలా.. ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి చిన్నారి భవిష్యకు విజయవంతంగా చికిత్స పూర్తయ్యేలా అన్ని విధాలా సహకరించిన కేటీఆర్‌కు అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. క్లిష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి భరోసా కల్పించిన కేటీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,యాదిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# సీఎం రేవంత్ రెడ్డి క్రిమినల్ వేస్ట్-కేటీఆర్

- 89 కేసులున్న క్రిమినల్ అని వ్యాఖ్య..
- 21 ఏళ్లకే చట్టసభల్లోకి అంటూ...
- ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర..
- యూత్ డిక్లరేషన్ పైఅసెంబ్లీలో చర్చ..
- ఐటీ పరిశ్రమకు అడ్డంకులుగా మంత్రులు?



హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

పదుల సంఖ్యలో క్రిమినల్ కేలున్న రేవంత్ రెడ్డిని సీఎం చేయడమే కాంగ్రెస్ చేసిన క్రిమినల్ వేస్ట్ అని కేటీఆర్ మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పై 89 కేసులున్న ఉన్న ఏకైక సీఎం అని వెల్లడించారు.విద్యావంతులైన తెలంగాణ యువతను, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించేలా ఆయన చేసిన వ్యాఖ్యలు..నిరుద్యోగులను మోసం చేయడమే అని స్పష్టం చేశారు.అందుకు రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ వెంటనే రాష్ట్ర యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే చట్టసభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలంటూ అసెంబ్లీలో తీర్మానాలు చేస్తామని చెప్పడం వెనక మరో కోణం ఉందని, ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జెన్-జీకి చెందిన యువకుడిని విద్యాశాఖ మంత్రిని చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు., వెంటనే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని, మంత్రి పదవిని యువకుడికి అప్పగించాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన రేవంత్ రెడ్డి ..150 మంది గురుకుల విద్యార్థుల మరణాలు ఆయన విజయమా? అని ఎద్దేవ చేశారు. ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులను ఎండ్రిన్ తాగి చావండనే పరిస్థితి కల్పించడమా? అని నిలదీశారు. తెలంగాణను నిర్మించిన ఇంజనీరింగ్ విద్యార్థులకు భవనాలు కట్టడమే కాదు, తమను అవమానించిన నాయకులకు, పార్టీలకు రాజకీయంగా సమాధి కట్టడం కూడా తెలుసని చురుకలు పెట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి న హామీలు అమలుకు నోచుకోలేదని..ఈ కారణంగా రాష్ట్రంలోని నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని, ప్రాణ త్యాగాలు చేసుకునే పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగి గడ్డం వేణు రాసిన సూసైడ్ నోట్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై దాఖలైన ఛార్జ్‌షీట్ అని పేర్కొన్నారు. వేణు లేఖను సీఎంకు బీఆర్ఎస్ తరపున పంపిస్తామని, దాన్ని చదివైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని కోరారు. ఉద్యోగాలు రావడం లేదని యువత ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. త్వరలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని,యువతకు పూర్తి అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

యూత్ డిక్లరేషన్ పై చర్చ..

రాబోయే అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించి, యూత్ డిక్లరేషన్, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యల పై ప్రత్యేకంగా చర్చ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 2.32 లక్షల ఉద్యోగాలకు ఆమోదం తెలిపి, 1.65 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం 10 వేల కొత్త ఉద్యోగాలకే పరిమితమైందని విమర్శించారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసమే నిరుద్యోగులను వాడుకోవడం కాంగ్రెస్‌కు అలవాటేనని దుయ్యబట్టారు.

ఐటీ ప్రగతి మంత్రల అడ్డంకులు..

రాష్ట్రంలో ఐటీ ప్రగతి తిరోగమనంలోకి వెళ్లడానికి, పారిశ్రామిక పెట్టుబడులు తగ్గిపోవడానికి కాంగ్రెస్ మంత్రుల బెదిరింపులే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు చెప్పినా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు జరిగిన మేలును ప్రజలు మర్చిపోరని, ప్రస్తుతం ఆ ప్రాజెక్టు నీటినే ప్రభుత్వం రివర్స్ పంపింగ్ చేస్తోందని స్పష్టం చేశారు. మెట్రో రైలు విస్తరణను రద్దు చేసి, హైదరాబాద్ అభివృద్ధిని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను ప్రశ్నించినందుకే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు తదితరులు పాల్గొన్నారు..

## అసాధారణ ప్రతిభ..అగ్గిపెట్టెలో ఇమిడేలా చీర..

**మరోసారి ప్రపంచానికి సిరిసిల్లా చేనేత వైభవం..**

**మూడు గంటల్లోపే చీర తయారు చేసిన వెల్ది హరిప్రసాద్...**

**అభినందనలు తెలిపిన కల్వకుంట్ల కవిత..**





హైదరాబాద్, ఆగస్టు 03 (ప్రజా కలం ప్రతినిధి)

సిరిసిల్ల చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అసాధారణ ప్రతిభతో మరో అద్భుతాన్ని సృష్టించారని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట కవిత అభినందనలు తెలిపారు.కేవలం రెండు గంటల యాభై నిమిషాల స్వల్ప వ్యవధిలోనే మగ్గంపై అద్భుతమైన చీరను నేసి, దాన్ని ఒక అగ్గిపెట్టెలో ఇమిడేలా చేసి తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నారని ఎక్స్ వేదికగా వివరించారు. చీర తయారికి సుమారు ఏడాది కాలం నిరంతరం శ్రమించాల్సి వస్తుందన్నారు.కానీ అందుకు భిన్నంగా ఎవరికీ సాధ్యం కానిరీతిలో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆయన పట్టుదల అందరినీ అబ్బురపరుస్తోందని కొనియాడారు. సిరిసిల్లా కార్మికుల నత్తాను మరోసారి ప్రపంచానికి తెలిపిన వెల్ది హరిప్రసాద్ ను అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా అభినందించారు..

## బోనాల జాతరకు కేటీఆర్ కు ఆహ్వానం

ముషీరాబాద్,ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

ఆషాడ మాసంలో ఆగస్టు 9,10 వ తేదీల్లో రామ్ నగర్ లోని మాజీ రామ్ నగర్ బిఆర్ఎస్ పార్టీడివిజన్ అధ్యక్షులు, సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల జాతరకు రావాల్సిందిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సోమవారం ఆహ్వానాన్ని అందజేశారు.రాష్ట్ర నాయకులు వి శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెఎన్ శ్రీనివాస్, రావు,కల్వ గోపి,నేత శ్రీనివాస్,అజయ్ ముదిరాజ్, రమేష్ ,మధు,రేషశీ మణికంత తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com